రిపోర్టర్లు కావలెను

తొలి సమయం

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న 'తొలి సమయం' మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...

9000689544, 7569944360 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.



దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం! గమనం!!

సంపుటి : 02 సంచిక : 296 శుక్రవారం14-11-2025 ఎడిటర్ వేముల అయోధ్య రాములు పేజీలు : 6 వెల : 5/-


## ఉత్కంఠ రేపుతున్న

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు



2

## హైదరాబాద్ రోడ్లకు కంపెనీల పేర్లు : సీఎం రేవంత్ రెడ్డి



ప్రపంచ పెట్టుబడిదారులకు హైదరాబాద్ నగరం ఉత్తమ గమ్యస్థానం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జీసీసీలకు గమ్యస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలని దిల్లీలో జరిగిన అమెరికా–భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరం సదస్సులో కోరారు. వచ్చే నెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులను రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్ : దిల్లీలో జరిగిన అమెరికా–భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరం సదస్సులో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ప్రదర్శించారు. అనంతరం మాట్లాడిన ఆయన భారత్‌లో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారమని తెలిపారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో తెలంగాణ రాష్ట్రం ముందుకెళ్తోందని అన్నారు. మహిళా సాధికారత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో

మిగతా 2లో

## విదేశాల్లోని భారత ఉద్యోగులకు గుడ్ న్యూస్... కేంద్రం సరికొత్త బిల్లు!



## ఎర్రకోట ఉగ్రకుట్రలో కొత్త కోణం..



**-మసూద్ అజర్ ఫ్యామిలీతో లింకులు!**

**-ఫరీదాబాద్ మాడ్యూల్ కీలక వ్యక్తికి మసూద్ అజర్ కుటుంబంతో సంబంధాలు**

**-పుల్వామా సూత్రధారి ఉమర్ ఫరూక్ భార్యతో షహీన్ టచ్‌లో ఉన్నట్టు గుర్తింపు**

**తెరపైకి జైషే మహ్మద్ మహిళా విభాగం 'జమాత్-ఉల్-మొమినాత్'**

మసూద్ సోదరి సాదియా అజర్ నేతృత్వంలో మహిళా బ్రిగేడ్ల ఏర్పాటు భారత్‌లో మహిళా ఉగ్రవాదుల నియామక బాధ్యతలు చూస్తున్న షహీన్ ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన ఉగ్రదాడి కుట్ర కేసు దర్యాప్తులో సంచలన విషయాలు బయటపడుతున్నాయి. ఈ కేసులో అరెస్టయిన ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్ కీలక సభ్యురాలు షహీన్ సయీద్‌కు, జైషే మహ్మద్ (జీఈఎం) ఉగ్రవాద సంస్థ చీఫ్ మసూద్ అజర్ కుటుంబంతో ప్రత్యక్ష సంబంధాలున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. పుల్వామా దాడి సూత్రధారి, జైషే కమాండర్ ఉమర్ ఫరూక్ భార్య అఫీరా బీబీతో షాహీన్ నిరంతరం టచ్‌లో ఉన్నట్లు వెల్లడైంది.

2019లో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను బలిగొన్న పుల్వామా దాడికి సూత్రధారి అయిన ఉమర్ ఫరూక్.. మసూద్ అజర్‌కు స్వయానా మేనల్లుడు. ఈ దాడి తర్వాత భద్రతా దళాలు జరిపిన ఆపరేషన్‌లో ఉమర్ హతమయ్యాడు. అతడి భార్యే ఈ అఫీరా బీబీ. ప్రస్తుతం జైషే కొత్తగా ప్రారంభించిన మహిళా విభాగం 'జమాత్–ఉల్–మొమినాత్'లో ఆమె కీలక పాత్ర పోషిస్తోంది. ఎర్రకోట దాడి కుట్రకు కొన్ని వారాల ముందే ఆమె ఈ విభాగంలోని అడ్వైజరీ

మిగతా 2లో

## దిల్లీ పేలుడు కారకులను తప్పనిసరిగా శిక్షిస్తాం : అమిత్ షా




2

## తెలంగాణను వణికిస్తున్న చలి పులి.. 8.2 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు



తెలంగాణ రాష్ట్రం చలితో గజగజ వణికిపోతోంది. ముఖ్యంగా అడవుల జిల్లాగా పేరున్న ఉమ్మడి ఆదిలాబాద్‌పై చలి పంజా విసురుతోంది. రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రత కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి మండలంలో 8.2 డిగ్రీలుగా నమోదైంది. గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు నమోదైన వివరాల ప్రకారం తిర్యాణి తర్వాత రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో 9.1 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలో 9.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, వనపర్తి, ఖమ్మం, జోగులాంబ గద్వాల జిల్లాలు మినహా మిగిలిన 29 జిల్లాల్లోనూ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయాయి. దీంతో చలి తీవ్రత రాష్ట్రమంతటా అధికంగా ఉంది.

ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. రానున్న మూడు రోజుల పాటు (శుక్ర, శని, ఆదివారాలు) రాష్ట్రంలో చలి ప్రభావం మరింత పెరగనుందని స్పష్టం చేసింది. కొన్ని జిల్లాల్లో సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గే

మిగతా 2లో

## పుణేలో కంటైనర్లు ఢీకొని భారీగా మంటలు..



**-మధ్యలో చిక్కుకుపోయిన కారు... 8 మంది మృతి!**

**-పుణే-బెంగళూరు జాతీయ రహదారిలోని నవలే వంతెన సమీపంలో ప్రమాదం**

**-క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలింపు**

**-కంటైనర్ అతివేగం, బ్రేక్ ఫెయిల్ కావడమే ప్రమాదానికి కారణం**

పుణే–బెంగళూరు జాతీయ రహదారిపై నవలే వంతెన సమీపంలో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది దుర్మరణం చెందగా, 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. రెండు కంటైనర్ లారీలు ఒకదానికొకటి ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో కంటైనర్ల మధ్యలో

మిగతా 2లో

# ఉత్కంఠ రేపుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు

తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల కోసం ఉత్కంఠ నెలకొంది. మరికొన్ని గంటల్లో రానున్న ఫలితంపై ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయి. 2023లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ దాదాపు 16 వేల ఓట్లకు పైగా తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్‌పై విజయం సాధించారు. గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి ఆయన సతీమణి మాగంటి సునీత పోటీ చేస్తుండగా.. కాంగ్రెస్ నుంచి మాజీ మజ్లిస్ నేత నవీన్ యాదవ్ బరిలో ఉన్నారు. బీజేపీ తరఫున లంకల దీపక్ రెడ్డి పోటీలో ఉన్నారు. ఈ ఫలితం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లలో ఎవరికి పట్టు ఉందో తేల్చనుంది.

తెలంగాణలో రాజకీయ ఉత్కంఠ పెంచిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక ఫలితాల కోసం రాష్ట్రమంతా ఎదురుచూస్తోంది. మరికొన్ని గంటల్లో రానున్న ఫలితాలు, బీఆర్ఎస్ తన సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకుంటుందా.. లేక అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఇక్కడ పాగా వేస్తుందా అనే చర్చ జోరుగా సాగుతోంది. ప్రస్తుతం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నా.. జూబ్లీహిల్స్ వంటి అత్యంత కీలక నియోజకవర్గంలో అసలు గెలుపు గుర్రం ఏంటో అంచనా వేయడం అంత సులభం కాదు.

ఈ ఉప ఎన్నిక ఫలితాన్ని అర్థం చేసుకోవాలంటే.. మొదట 2023 సాధారణ అసెంబ్లీ ఎన్నికలు ఎలా జరిగాయి.. అప్పటి ప్రధాన అభ్యర్థుల విజయ పరంపరను విశ్లేషించుకోవాలి.

2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అంచనాలకు భిన్నంగా, అత్యంత ఆసక్తికరంగా మారింది. ఇక్కడ త్రిముఖ పోరు నడిచినా.. ప్రధానంగా పోటీ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ఉంది.

మాగంటి గోపీనాథ్ (బీఆర్ఎస్):

సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి గోపీనాథ్ ఈ ఎన్నికల్లో విజేతగా నిలిచారు. నియోజకవర్గంలో బలమైన స్థానిక నాయకుడిగా.. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా ఆయనకు ఉన్న పట్టు, బీఆర్ఎస్‌కు ఉన్న సంస్థాగత బలం, ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో ఉన్న నమ్మకం కలిసి వచ్చాయి. ఆయనకు దాదాపు 80,000కు పైగా ఓట్లు లభించాయి.

మహిళా సంఘాలకు శుభవార్త.. ఏడాదికి రూ.20 లక్షల ఆదాయం.. 90 శాతం లోన్ కూడా

'భారత్‌తో యుద్ధానికి మేం సిద్ధం: ఢిల్లీ పేలుడు వేళ పాకిస్థాన్ మంత్రి సంచలనం

రాజేంద్రనగర్‌లో దొంగల బీభత్సం.. విల్లాలో 31 తులాల బంగారు ఆభరణాలు చోరీ

2014లో టీడీపీ నుంచి పోటీచేసిన గోపీనాథ్ విజయం సాధించారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన గోపీనాథ్.. 2018లో కూడా విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా సక్సెస్ సాధించి.. హ్యాట్రిక్ కొట్టాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న మాగంటి గోపీనాథ్ గుండెపోటుతో మరణించడంతో.. ఉప ఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ పార్టీ తమ మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి అయిన మాగంటి సునీతను 2025 జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బరిలోకి దించింది. గోపీనాథ్‌కు నియోజకవర్గంలో ఉన్న పట్టు, సానుభూతి ఓట్లు, బీఆర్ఎస్ కార్యకర్తల పట్టుదల సునీతకు కలిసి వస్తాయని బీఆర్ఎస్ గట్టి నమ్మకంతో ఉంది.

మహమ్మద్ అజారుద్దీన్ (కాంగ్రెస్):

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అయిన అజారుద్దీన్, తెలంగాణలో పోటీ చేసిన ఈ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఆయనకు దాదాపు 64,212 ఓట్లు వచ్చాయి. ఆయన క్రికెట్ నేపథ్యం, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఉన్నా.. స్థానిక రాజకీయాలపై పట్టు లేకపోవడం, నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలం ముందు నిలవలేకపోయారు. 2023లో ఓటమి పాలైనప్పటికీ.. పార్టీలో తన పాత్రను కొనసాగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు అతడికి మంత్రి పదవి ఇచ్చారు. ఇక బీజేపీ తరఫున పోటీ చేసిన లంకల దీపక్ రెడ్డి దాదాపు 25వేలకు పైగా ఓట్లు సాధించి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. 2023 ఎన్నికల్లో మాగంటి గోపీనాథ్, అజారుద్దీన్‌పై 16 వేలకు పైగా ఓట్లతో విజయం సాధించాడు.

నవీన్ యాదవ్..

ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరఫున నిల్చున్న నవీన్ యాదవ్ రాజకీయ ప్రయాణం చాలా ఆసక్తికరంగా సాగింది. మొదట ఆయన మజ్లిస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి.. ఆ పార్టీలో అనేక హోదాల్లో పనిచేశాడు. 2014లో జూబ్లీహిల్స్ నుంచి ఎంఐఎం తరఫున పోటీ చేశాడు. కానీ టీడీపీ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ చేతిలో 9,000 పైగా ఓట్ల తేడాతో ఓడిపోయాడు. ఆ తర్వాత 2018లో ఎంఐఎం టికెట్ ఇవ్వకపోవడంతో పార్టీని వీడి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశాడు. ఆ ఎన్నికల్లో 18,800 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచాడు.

2023 ఎన్నికల సమయంలో కూడా ఆయన స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశాడు. అయితే ఆ తరువాత కాంగ్రెస్‌లో చేరమని మాజీ క్రికెటర్ ముహమ్మద్ అజహరుద్దీన్ సూచించడంతో నామినేషన్‌ను వెనక్కి తీసుకొని.. నవంబర్ 15న రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాడు. ఆయన "నవ యువ నిర్మాణ్" అనే స్వచ్ఛంద సంస్థను నడుపుతూ యువతకు ఉపాధి శిక్షణ, ప్రోత్సాహం కల్పిస్తున్నాడు.

ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో నవీన్ యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థిగా అక్టోబర్ 8న ప్రకటించింది. దీంతో ఆయనకు మళ్లీ రాజకీయ రంగంలో కీలక అవకాశం లభించింది. ప్రస్తుతం ఈ ఎన్నికలో నవీన్ యాదవ్ గెలుపు నల్లేరు మీద నడకే అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గ ప్రజలు ఎవరికి పట్టం కట్టారు అనేది రేపు తెలవనుంది.

లంకల దీపక్ రెడ్డి (బీజేపీ)..

లంకల దీపక్ రెడ్డి రాజకీయాల్లోకి తెలుగుదేశం పార్టీ ద్వారానే వచ్చాడు. అక్కడ 25 ఏళ్లపాటు పనిచేస్తూ.. ఎన్నో బాధ్యతలు చేపట్టాడు. 2019లో టిడిపి నుంచి బయటకు వచ్చి.. భారతీయ జనతా పార్టీలో చేరాడు. బీజేపీలో కూడా క్రమంగా ఎదిగి, వివిధ హోదాల్లో సేవలు అందించాడు. 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి, 25,866 ఓట్లు సాధించి మూడవ స్థానంలో నిలిచాడు. తర్వాత ఆయన కృషిని గుర్తించిన పార్టీ.. 2025 ఫిబ్రవరిలో దీపక్ రెడ్డిని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించింది. ప్రస్తుతం ఆయన ఆ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చెందడంతో ఉపఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో.. అక్టోబర్ 15న బీజేపీ అధిష్ఠానం దీపక్ రెడ్డిని తమ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ఆయన మరోసారి ప్రజల నడుమ బీజేపీ తరఫున పోటీ చేశాడు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్వో కర్ణన్ తెలిపారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని డీఆర్సీ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. 407 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్లు లెక్కిస్తామన్నారు.

మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నందున ప్రత్యేక అనుమతి తీసుకుని లెక్కింపునకు 42 టేబుళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేస్తామని వివరించారు. కౌంటింగ్‌కు మొత్తం 186 మంది సిబ్బందిని కేటాయించామని, ఫలితాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్ లో అప్‌లోడ్ చేస్తామని వెల్లడించారు. మీడియాకు ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ఫలితాలను వెల్లడిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 250 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని నగర జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. 15 ప్లాటూన్ల సిబ్బందిని రప్పిస్తున్నామని ఆర్వో కర్ణన్ తెలిపారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అనుమతి ఉన్నవారు మాత్రమే లెక్కింపు కేంద్రం వద్దకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒక్కో రౌండుకు 45 నిమిషాలు : బుధవారం ఉదయం అన్ని పార్టీల అభ్యర్థులు స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే అధికారులకు గురువారం తుది విడత శిక్షణ ఉంటుంది. శుక్రవారం వేకువజామున వారంతా స్ట్రాంగ్ రూమునకు చేరుకుంటారు. ఉదయం 5 గంటలకే అభ్యర్థుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి స్ట్రాంగ్ రూమ్ తలుపులు తెరిచి లోపలికి వెళ్తారు. ఈవీఎంలపై ఉండే సీళ్లు, ఇతరత్రా భద్రత ఏర్పాట్లను సరి చూసుకుని అంతా సవ్యంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాత ఓట్ల లెక్కింపు కేంద్రానికి వెళ్తారు. ఒక్కో రౌండు ఓట్ల లెక్కింపునకు 45 నిమిషాల సమయం పట్టనుందని అంచనా. మొత్తం ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటలకు పూర్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పోలింగ్ సరళి : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోలింగ్ శాతం అతి తక్కువగా నమోదు కావడంతో గెలుపు అవకాశాలు ఉత్కంఠను రేపుతున్నాయి. తక్కువ పోలింగ్ శాతం తమకే అనుకూలమని అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ విశ్లేషిస్తున్నాయి. సర్వేలన్నీ కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నాయి. సిట్టింగ్ స్థానం తమకే దక్కుతుందని బీఆర్ ఎస్ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఎగ్జిట్ పోల్స్ ప్రకారం చూస్తే కాంగ్రెస్ 6 నుంచి 9 శాతం వరకు ఆధిక్యం వస్తుందని అంచనాలు వేస్తున్నారు.

ఎక్కడెక్కడ ఎలా :

ప్రస్తుతం నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,94,631 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు.

విజేతకు సుమారు 50 శాతం అంటే 97 వేల ఓట్లు రావాల్సి ఉంటుంది. ఇది బీజేపీకి పడే ఓట్లపై ఆధారపడి ఉంటాయి. బీజేపీ ఎక్కువ ఓట్లను చీల్చగలిగితే తక్కువ ఓట్లు వచ్చినా విజేతగా నిలుస్తారు. అలాగే సోమాజిగూడలో 32 వేలు తక్కువగానే ఓట్లు ఉన్నాయి. ఇక్కడ పోలింగ్ శాతం కూడా తక్కువే.

షేక్‌పేట, రహ్మత్‌నగర్ డివిజన్లలో ఎక్కువ ఓట్లు అనేవి ఉన్నాయి. 70 వేల చొప్పున 1.40 లక్షల ఓట్లు ఇక్కడే ఉన్నాయి. ఇక్కడ ఆధిక్యం అధికంగా వచ్చినవారికి విజయం దక్కుతుందని విశ్లేషకులు అభిప్రాయం. ఎర్రగడ్డలో సుమారు 60 వేలు, యూసుఫ్‌గూడలో 58 వేలు, వెంగళరావునగర్‌లో 54 వేలు, బోరబండలో 50 వేల ఓట్లు అనేవి ఉన్నాయి.

# పుణేలో కంటైనర్లు ఢీకొని భారీగా మంటలు..

కారు చిక్కుకుపోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారంతా సజీవదహనమయ్యారు.

క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసు బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అగ్నిమాపక యంత్రాల ద్వారా మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఒక కంటైనర్ అతి వేగంగా వచ్చి పలు వాహనాలను ఢీకొంటూ ముందుకు దూసుకెళ్లి మరో కంటైనర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మంటలు వ్యాపించాయని, అదే సమయంలో వాటి మధ్యలో చిక్కుకున్న కారు కూడా మంటల్లో కాలిపోయిందని పోలీసులు తెలిపారు. మృతులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

"సతారా నుంచి ముంబై వైపు వెళుతున్న ఒక కంటైనర్ ట్రక్ బ్రేక్ ఫెయిల్ అవ్వడం వల్ల అదుపు తప్పిందని తెలిసింది. ఆ ట్రక్ ఏడు నుంచి ఎనిమిది వాహనాలను ఢీకొట్టింది. చివరకి మరో పెద్ద కంటైనర్ ట్రక్కును బలంగా ఢీకొంది. ఒక కారు వాటి మధ్యలో చిక్కుకుని నుజ్జునుజ్జు అయింది... మంటల్లో కాలిపోయింది" అని సంఘటనా స్థలానికి చేరుకున్న ఒక పోలీసు అధికారి తెలిపారు. అతివేగం, బ్రేక్ ఫెయిల్ కావడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించామని ఆయన పేర్కొన్నారు.

# ఎర్రకోట ఉగ్రకుట్రలో కొత్త కోణం..

కౌన్సిల్‌లో చేరినట్లు తెలిసింది. మసూద్ అజర్ సోదరి.. 1999 కాందహార్ విమాన హైజాక్ సూత్రధారి యూసఫ్ అజర్ భార్య అయిన సాదియా అజర్‌తో కలిసి అఫీరా పనిచేస్తున్నట్లు సమాచారం.

భారత్‌లో మహిళా ఉగ్రవాదుల నియామకమే లక్ష్యం

ఇటీవల భారత భద్రతా దళాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో జైషే మహ్మద్ ప్రధాన కేంద్రం ధ్వంసమై మసూద్ కుటుంబం చెల్లాచెదురైంది. ఈ నేపథ్యంలో ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగించేందుకు జైషే మహిళా బ్రిగేడ్ల ఏర్పాటుపై దృష్టి సారించినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. మసూద్ సోదరి సాదియా అజర్ నేతృత్వంలో 'జమాత్-ఉల్-మొమినాత్' విభాగాన్ని ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ విభాగంలో షహీన్ సయీద్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. భారత్‌లో కొత్తగా మహిళా విభాగాలను స్థాపించడం, స్థానికంగా మహిళలను ఉగ్రవాదం వైపు ఆకర్షించి నియామకాలు చేపట్టడం వంటి కార్యకలాపాలను షహీన్ పర్యవేక్షిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.

# ఫలితాల వేళ మహాగఠ్‌బంధన్ నేతలతో తేజస్వీ భేటీ- వాటిపై కీలక చర్చలు!

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వేళ మహాగఠ్‌బంధన్ నేతలతో సమావేశమయ్యారు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్. గురువారం పట్నాలోని తేజస్వీ నివాసంలో జరిగిన సమావేశానికి వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ అధ్యక్షుడు ముఖేశ్ సాహ్నీ, సీపీఐ(ఎమ్ఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య సహా పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. అంతకుముందు పార్టీ అభ్యర్థులు, జిల్లా స్థాయి నేతలతో ఆన్‌లైన్ వేదికగా సమావేశమయ్యారు. ఇందులో ఓట్ల లెక్కింపు మార్గదర్శకాలతో పాటు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఓట్ల లెక్కింపులో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అంతకుముందు ఎగ్జిట్ పోల్స్ అంచనాలను ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మరోసారి తోసిపుచ్చారు. కౌంటింగ్ సమయంలో ఏమైనా చట్ట విరుద్ధ కార్యకలాపాలు జరిగితే వాటిని ఎదుర్కొనేందుకు తమ పార్టీ కార్యకర్తలు, సామాన్యులూ సిద్ధంగా ఉన్నారని వివరించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు బిహారీలు నిబద్ధతతో ఉన్నారంటూ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. గతంలో మాదిరిగా కౌంటింగ్ నిలిపివేస్తే పరిణామాలు తీవ్రంగా (నేపాల్ మాదిరిగా) ఉంటాయని ఆర్జేడీ మరో కీలక నేత సునీల్ కుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కాగా, హోరాహోరీగా సాగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుందని ఈసీ తెలిపింది. ఇందుకోసం 38 జిల్లాల్లో 46 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద రెండంచెల భద్రతతో పాటు పరిసరాల్లో సీసీటీవీలను అమర్చింది. స్ట్రాంగ్ రూమ్‌లలోనే కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసిన ఈసీ, ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తాన్ని రికార్డు చేయనున్నట్లు తెలిపింది. రెండు విడతల్లో జరిగిన ఎన్నికల్లో రికార్డు స్థాయి పోలింగ్ నమోదు కావడంతో విజయం సాధించబోతున్నామంటూ ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ కూటములు తమకు అనుకూలమైన భాష్యాలు చెబుతున్నాయి. ఎగ్జిట్ పోల్స్ మాత్రం ఎన్డీయే కూటమికే పట్టం కట్టాయి.

బిహార్‌లో మొత్తం 243 స్థానాలు ఉండగా ఈ నెల 6, 11న రెండు విడతల్లో పోలింగ్ జరిగింది. ఈ సారి రికార్డు స్థాయిలో 67.13 పోలింగ్ నమోదైంది. 1951 తర్వాత ఇదే అత్యధిక పోలింగ్ అని ఈసీ తెలిపింది. మహిళా ఓటర్లలో 71.78 శాతం, పురుషుల్లో 62.98 శాతం మంది ఓటు వేశారని వెల్లడించింది. బిహార్‌లోని 38 జిల్లాల్లో ఎక్కడా రీపోలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తులు రాలేదని పేర్కొంది. 2,616మంది అభ్యర్థులతో పాటు 12 గుర్తింపు పొందిన పార్టీల నుంచి కూడా వినతులు రాలేదని వెల్లడించింది. ఫలితాల కోసం ఈసీఐ అధికారిక వెబ్‌సైట్ మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని చెప్పింది. టీవీ ఛానళ్లు, ఇంటర్నెట్, మీడియా సంస్థలు సైతం అధికారిక పోర్టల్‌లోని సమాచారాన్ని తీసుకోవాలని సూచించింది.

## హైదరాబాద్ రోడ్లకు కంపెనీల పేర్లు : సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశ : అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ భారత దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం పేర్కొన్నారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తైతే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్ %-% ఆర్ఆర్ఆర్ మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్‌వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. చైనా ం 1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందని తెలిపారు. నాయకుల పేర్లకు బదులు కంపెనీల పేర్లను పెడతాం : హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని రేవంత్ చెప్పారు. రోడ్లకు నేతల పేర్లు పెట్టే విధానాన్ని మార్చి హైదరాబాదులో ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీల పేర్లను పెడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. టెక్ దిగ్గజాలు ప్రశంస : 2034 నాటికి తెలంగాణ రాష్ట్రంను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. సీఎం విజ్ఞప్తికి సిస్కో మాజీ సీఈఓ జాన్ ఛాంబర్, అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరం సీఈఓ, అధ్యక్షుడు డాక్టర్ ముకేశ్ అఘి సహా మిగతా ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. రేవంత్ రెడ్డి దార్శనికత తెలంగాణ రైజింగ్ 2047లో ప్రస్ఫుటంగా కనిపిస్తోందని టెక్ దిగ్గజాలు ప్రశంసించారు. డిసెంబర్ 8,89 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

## విదేశాల్లోని భారత ఉద్యోగులకు గుడ్ న్యూస్... కేంద్రం సరికొత్త బిల్లు!

విదేశాల్లో పనిచేస్తున్న, పనిచేయడానికి వెళుతున్న భారతీయ కార్మికులు, నిపుణుల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వలసలపై వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో, భారత ఉద్యోగులకు మెరుగైన అవకాశాలు, భద్రత కల్పించడంతో పాటు, వారు తమ ఉద్యోగ కాలం ముగిశాక తిరిగి స్వదేశానికి వచ్చేలా ప్రోత్సహించేందుకు 'ఓవర్సీస్ మొబిలిటీ (ఫెసిలిటేషన్ అండ్ వెల్ఫేర్) బిల్లు, 2025'ను ప్రతిపాదించింది. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'ది డిప్లొమాట్' కథనం ప్రకారం, ఈ కొత్త బిల్లు కేవలం వలస విధానంలో మార్పు కాదు, ఆర్థిక దౌత్యంలో కార్మిక శక్తిని ఒక మూలస్తంభంగా మార్చే ప్రయత్నం. ఇప్పటివరకు అమల్లో ఉన్న 1983 నాటి పాత వలస చట్టం స్థానంలో ఈ కొత్త బిల్లు సమగ్రమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురానుంది. ఇది కేవలం విదేశీ ఉపాధిని సులభతరం చేయడమే కాకుండా, ఉద్యోగులు సురక్షితంగా తిరిగి రావడం, స్వదేశంలో వారి పునరేకీకరణకు కూడా భరోసా ఇస్తుంది. ఈ బిల్లు ద్వారా భారత ప్రభుత్వం తన కార్మికుల వలసలను కేవలం ప్రేక్షకపాత్రకే పరిమితం చేయకుండా, వారి ఉద్యోగ నిబంధనలపై ఇతర దేశాలతో చురుగ్గా చర్చలు జరుపుతోంది. 2014 నుంచి భారత కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే యూరప్, ఆసియా, గల్ఫ్ ప్రాంతాల్లోని దాదాపు 20 దేశాలతో కార్మిక మొబిలిటీ ఒప్పందాలు కుదుర్చుకుంది. "అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గి కార్మికుల కొరత ఏర్పడుతుంటే, భారత్ వంటి దేశాల్లో స్థిరమైన జనాభా ఉన్నా ఉద్యోగాల కొరత ఉంది. ఈ సమస్యకు శాశ్వత వలసలు పరిష్కారం కాదు, ఎందుకంటే దీనివల్ల రాజకీయ వ్యతిరేకత వస్తోంది. అందుకే, భారత్ తన నైపుణ్యాలను ఒక నిర్ణీత కాలపరిమితితో ఎగుమతి చేసే మార్గాన్ని ఎంచుకుంది" అని ఆ కథనం విశ్లేషించింది.

భారత్ అతిపెద్ద ఆస్తి 25 ఏళ్లలోపు వయసున్న 60 కోట్లకు పైగా యువత కాగా, అభివృద్ధి చెందిన దేశాలు తీవ్రమైన కార్మికుల కొరతను ఎదుర్కొంటున్నాయి. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ అధ్యయనం ప్రకారం, 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 4.5 నుంచి 5 కోట్ల మంది కార్మికుల కొరత ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో జర్మనీ, జపాన్ వంటి దేశాలు భారతీయ కార్మికుల కోసం చురుగ్గా ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే భారత్ కుదుర్చుకుంటున్న ఒప్పందాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఉదాహరణకు, భారత్-యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (%జజుూా%) ప్రకారం, యూకేలో తాత్కాలికంగా పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు అక్కడి సామాజిక భద్రతా చందాలు చెల్లించకుండా మూడేళ్లపాటు మినహాయింపు పొందారు. దీనివల్ల భారత కంపెనీలకు ఏటా సుమారు రూ.4,000 కోట్ల ఆదా అవుతుందని అంచనా. ప్రతిపాదిత కొత్త బిల్లు వివిధ దేశాల ప్రభుత్వాల మధ్య సమన్వయం పెంచడానికి, అంతర్జాతీయ వలస ఒప్పందాలను పర్యవేక్షించడానికి, డేటా ఆధారిత విధానాలను రూపొందించడానికి దోహదపడుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా, విదేశాలకు వెళ్లే భారతీయుల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి, వారి హక్కులను కాపాడటానికి అవసరమైన వ్యవస్థలను ఇది బలోపేతం చేయనుంది.

## ఢిల్లీ పేలుడు కారకులను తప్పనిసరిగా శిక్షిస్తాం : అమిత్ షా

ఎర్రకోట పేలుడు కారకులను కఠినంగా శిక్షిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం చెప్పారు. కుట్రదారులకు శిక్ష పడేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మరోసారి ఇలాంటి దాడులు చేసేందుకు ఆలోచన వస్తేనే భయపడేలా ప్రపంచానికి సందేశం పంపుతామని పేర్కొన్నారు. పేలుడు కారకులకు కఠిన శిక్ష విధిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని, అది తప్పకుండా నెరవేరుస్తామని వెల్లడించారు. గుజరాత్‌లో మోతీభాయ్ ఆర్ చౌదరీ సాగర్ సైనిక్ స్కూల్, సాగర్ ఆర్గానిక్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మరోవైపు దేశవ్యాప్తంగా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పద్ధతిలో 100 సైనిక్ స్కూళ్లను ప్రారంభించేందుకు మోదీ ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు. దీంతో పాటు సేంద్రీయ వ్యవసాయం చేయాలని రైతులందరికీ పిలుపునిచ్చారు. రైతులతో పాటు వారి కుటుంబసభ్యులు ఆర్గానిక్ ఉత్పత్తులనే వినియోగించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

"ఢిల్లీ ఉగ్రదాడి కారకులకు తప్పనిసరిగా కఠిన శిక్ష విధిస్తాం. ఫలితంగా మన దేశంపై ఇంకోసారి మరెవ్వరూ దాడి చేసే ఆలోచనే రాకుండా చేస్తాం. ఈ కిరాతక ఘటనకు బాధ్యులైన వారికి చట్టం ముందుకు తీసుకువచ్చి కఠిన శిక్ష పడేలా చేస్తాం. భారత ప్రభుత్వం, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ విషయంలో నిబద్ధతతో ఉంది. ప్రధాని మోదీ నాయకత్వంలో గత 11 ఏళ్లలో భారత్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతుందని ప్రపంచమంతా గుర్తించింది. ఇంకా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలోనూ మోదీ ముందుండి పోరాడారు."

అంతకుముందు దిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు వెనుక ఎవరున్నా విడిచిపెట్టేదిలేదని ప్రధాని మోదీ హెచ్చరించిన వేళ, తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా అదే శైలిలో స్పందించారు. ఈ దాడి వెనుక ఉన్న ప్రతి ఒక్కరిని వేటాడాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో దిల్లీతో పాటు దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో భద్రతపై ఉన్నతాధికారులతో మంగళవారం రెండు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో పేలుడు జరిగిన తర్వాత నెలకొన్న పరిస్థితుల గురించి ఉన్నతాధికారులు అమిత్ షాకు వివరించారు.

సోమవారం దిల్లీలోని ఎర్రకోటలో జరిగిన బాంబు పేలుడుతో దేశ రాజధాని ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 13కు చేరింది. ఘటన అనంతరం దిల్లీ ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి వెళ్లిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బాధితులను పరామర్శించి వారి పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఘటనా స్థలిని పరిశీలించిన ఆయన, పేలుడు ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

## తెలంగాణను వణికిస్తున్న చలి పులి.. 8.2 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, మంచిర్యాల జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే కూడా తక్కువకు పడిపోయే సూచనలు ఉన్నాయని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

దిన పత్రిక
తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!

శుక్రవారం 14 నవంబర్ 2025

# బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్ కి వినతి పత్రం అందించిన కంబలాపురం గ్రామ విద్యార్థులు



తొలి సమయం శ్రీరంగాపూర్ నవంబర్ 13 శ్రీరంగాపురం మండలం కంబాలపూర్ గ్రామం నుండి దాదాపు 40 మంది బాలికలు ప్రతినిత్యం మండల కేంద్రానికి పై చదువుల కోసం వెళు తుంటారు కానీ చదువు ముగించుకొని సాయంత్రం సొంత గ్రామం చేరడానికి ఐదు గంటలకు పాఠశాల వదలగా అప్పుడు వారికి గ్రామానికి రావడానికి బస్సు సౌకర్యం లేనందున ప్రతిరోజు నడుచుకుంటూ కంబాలపురం చేరుకుంటున్నారు వారు ఇంటికి వచ్చే సమయం రాత్రి 7 కావస్తుంది కాబట్టి ఇట్టి విషయాన్ని విద్యార్థులు స్వయంగా వెళ్లి జిల్లా కలెక్టర్ గారికి మరియు డిపో మేనేజర్ గారికి సాయంత్రం ఐదు గంటలకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందించడం జరిగింది.

## శ్రీరంగాపురం మండలంలో ఘనంగా జాతీయ గేయం వందేమాతరం 150 వ సంవత్సరం వేడుకలు




తొలి సమయం శ్రీరంగాపూర్ నవంబర్ 13 ఈరోజు వనపర్తి జిల్లా, శ్రీరంగాపురం మండలంలో, మన భారతదేశంలో ఉన్న 140 కోట్ల జనాభా అందరూ ఐకమత్యంగా ఉండాలని, మరియు స్వాతంత్రానికి ముందు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కొల్లగొట్టిన మన భారత హిందూ మత, మరియు ఇతర మతస్తుల సామాన్య ప్రజల నినాదం వందేమాతరం. జాతీయ గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున భారత గౌరవ ప్రధాని మరియు ఇతర అన్ని రాజకీయ పార్టీలు,మరియు కుల సంఘాలు, మత సంఘాలు అందరూ కూడా జాతీయ గేయం వందేమాతరం పాడి భారత దేశ చరిత్రలో అన్ని కులాలు మరియు మతాలవారు ఐకమత్యంగా ఉండాలని ఈరోజు జాతీయ గేయం అన్ని పార్టీలకు అతీతంగా ఆలపించడం జరిగింది.
ఇందులో భాగంగా జూనియర్ కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులు, మరియు గవర్నమెంట్ హై స్కూల్ విద్యార్థులు, మరియు ప్రైవేట్ స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు,వివిధ కుల సంఘ నాయకులు పాల్గొనడం జరిగింది. ఇందులో భాగంగా పాల్గొన్నవారు..
సభిరెడ్డి వెంకట్ రెడ్డి , మెంటంపల్లి పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాఘవేందర్ గౌడ్, పెద్దిరాజు, నలువోతుల విష్ణువర్ధన్ నాయుడు, రాములు యాదవ్, రాజేష్, చరణ్, ఆశన్న, నీరడి ఆనందు సాగర్, లక్ష్మీనారాయణ, మరియు డాక్టర్ రాములు శ్రీరంగాపురం మండల నాయకులు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. సహకరించిన విద్యార్థులు, విద్యార్థినిలు, మరియు స్కూలు యజమాన్యం, కళాశాల యజమానియం, ప్రైవేటు కళాశాలల నిర్వాహకులకు అందరికి కూడా ధన్యవాదాలు.

# ఉచిత గ్యాస్ కోసం దరఖాస్తులు

తొలి సమయం దంతాలపల్లి నవంబర్ 13:
నరసింహుల పేట దంతాలపల్లి మండల గ్రామాల ప్రజలు
నర్సింహుల పేట భారత్ గ్యాస్ నందు ఉచిత గ్యాస్ కోసం( ఉజ్వల కనెక్షన్) దరఖాస్తులు చేసుకోవాలని నాగార్జున భారత్ గ్యాస్ సంస్థ యజమాన్యం తెలిపినారు. కావున ఇట్టి అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా , దరఖాస్తు చేసుకునే తీసుకురావాల్సిన పత్రాలు,

1. రేషన్ కార్డ్ గ్యాస్ కలెక్షన్ లేనిది
2. రేషన్ కార్డులో ఎంతమంది ఉంటే అంతమంది ఆధార్ కార్డు జిరాక్స్ లు
3. ఇంటి యజమాని మహిళ యొక్క నాలుగు పాస్ ఫోటోలు
4. ఇంటి యజమాని మహిళ యొక్క బ్యాంక్ అకౌంట్ జిరాక్స్
5. ఎస్సీ/ఎస్టి అయితే ఇంటి యజమాని మహిళ యొక్క కులం సర్టిఫికేట్
6. మరింత సమాచారాన్ని తెలుసుకొనుటకు సంప్రదించవలసిన చరవాణి నెంబర్స్ 9989222888, 8074685253.

# విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ ఆఫ్ కేసముద్రం అధ్యక్షులు మామిడి అశోక్.




తొలిసమయం.ఇనుగుర్తి,నవంబర్ 13: ఇనుగుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అయ్యగారి పెల్లి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కేసముద్రం అధ్యక్షుడు మామిడి అశోక్ తన సొంత గ్రామమైన అయ్యగారిపెల్లి విద్యార్థులకు సొంత ఖర్చులతో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ ను బొడ్రాయి సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ జోనల్ చైర్మన్ చిర యాకాంత%శీ% గౌడ్, అయ్యగారి పెల్లి మాజీ సర్పంచ్ మామిడి అశోక్, మాజీ ఎంపిటిసి మంజుల మంగ నాయక్, ఇనుగుర్తి మాజీ ఉప సర్పంచ్ గుండ్రపల్లి దేవేందర్, మరియు అయ్యగారి పెల్లి గ్రామస్తులైన మలిశెట్టి శోభన్, శ్రీరామ్ వీరేందర్ మామిడి సోమశేఖర్, సురేష్, హర్షవర్ధన్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తుగా అడ్మిషన్ డ్రైవ్ చేపట్టిన ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు.

తొలి సమయం పెబ్బేరు నవంబర్ 13 పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు. కళాశాల ప్రిన్సిపల్ భద్రసేన్ ఆదేశానుసారం, అడ్మిషన్ డ్రైవ్ లో భాగంగా పెబ్బేరు గ్రామంలోని జిల్లా ఉన్నత పాఠశాలకు, బాలికల బాలుర పాఠశాలకు వెళ్లడం జరిగింది. వచ్చే సం వత్సరం అకాడమిక్ ఇయర్ జూన్ 2026 లో అధికంగావిద్యార్థులనుఅడ్మిషన్ చేయించుటకై,ఇప్పటినుండి పెబ్బేరు మండలంలోని వివిధ జిల్లా ఉన్నత పాఠశాలలను సందర్శిస్తూ, అడ్మిషన్ కోసం కృషిచేస్తున్నారు. ఈరోజు పెబ్బేరు గ్రామం జిల్లా ఉన్నత పాఠశాల బాలికల మరియు బాలుర పాఠశాలలకు వెళ్లడం జరిగింది విద్యార్థులకు, విద్యార్థులకు జూనియర్ కళాశాల యొక్క ఔనత్యాన్ని తెలియజేస్తూ,మోటివేషన్ క్లాస్ ఇవ్వడం జరిగింది. మీరు పదవ తరగతిలో మంచి ఫలితాలను సాధించి పై చదువులకోసంఇంటర్మీడియట్లో మా ప్రభుత్వ జూనియర్ కళాశాలపెబ్బేర్లోచేరవలసిందిగా విద్యార్థిని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. మాకళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఐసి ఇంగ్లీష్ మీడియం మరియు తెలియమీడియంలో గ్రూపులు ఉన్నాయని. ప్రతి సంవత్సరం మా జూనియర్ కళాశాలనుండిమావిద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధిస్తూ వస్తున్నారని అక్కడి పదవ తరగతి విద్యార్థులకు తెలియజేశారు. మీరు కూడా మా కళాశాలలో చేరండి మీ భవిష్యత్తు అభివృద్ధి కోసం మేము కృషి చేస్తామని తెలిపారు , బాలికల ఇంచార్జ్ ఉపాధ్యాయురాలు వరలక్ష్మి మాట్లాడుతూ ప్రతి సం వత్సరం మా పాఠశాల విద్యార్థులను, మీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరడానికి మా పాఠశాల ఉపాధ్యా యులు. మేము కృషి చేస్తామని తెలిపారు. మా ప్రభుత్వ జూనియర్ కళాశాల పెబ్బేర్ ప్రతి సంవత్సరం ఇంటర్మీడియట్ లో మా విద్యార్థులు మంచిఫలితాలను సాధిస్తూ జిల్లా స్థాయిలో పోటీపడుతున్నారని, ఆ పాఠశాల విద్యార్థులకు, అక్కడి ఉపాధ్యాయులకు, కళాశాల అధ్యాపకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి కృష్ణయ్య, హనుమంత్ రెడ్డి ,నవీన్ కుమార్, జ్ఞానేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.







# గ్రంథాలయ వారోత్సవాలు - విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

### జిల్లా గ్రంధాలయ సంస్థ అధికారిణి టి.శ్రీలత

తొలి సమయం మహబూబాబాద్, నవంబర్.13ఈ నెల 14వ తేదీ నుండి 20 వ తేదీ వరకు 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంచార్జి అధికారిని టి.శ్రీలత నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యం గ్రంథాలయాల ఆవశ్యకతను ప్రజలకు తెలియజెప్పడం అన్నారు. అలాగే గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజల సహకారం కోరడం, సంపూర్ణ అక్షరాస్యత ఆవశ్యకతను ప్రజలకు తెలియ జేయడమని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రంథాలయాలలో సభ్యత్వం పెంచే ఉద్దేశ్యాలను సాధించే దిశగా ఈ వారోత్సవాలను శాఖా గ్రంథాలయంలో జరుగుతాయన్నారు.
ఇందులో భాగంగా 14వ తేదీ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు పిల్లల దినోత్సవం,ఉత్తమ గ్రంథ పాలకులకు మరియు పాటకులకు సన్మాన కార్యక్రమము, 15 వ తేదీ పుస్తక ప్రదర్శనలు,16వ తేదీ గ్రంథాలయ ఒరియంటేషన్ సెషన్,



కమ్యునిటీ రీడింగ్ డ్రైవ్ 17వ తేదీ కవి సమ్మేళనాలు, సెమినార్లు, 18వ తేదీ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, 19 వ రంగోలి పోటీలు, 20 వ తేది జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు జరుగుతాయని వివరించారు. ఈ సందర్భముగా పై పోటీలలో కళాశాల,పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనవచ్చునని తమ కళాశాల/పాఠశాల నుండి పై పోటీలకు అనగా ఒక్కొక్క పోటీకి ఆరుగురికి తక్కువ కాకుండా విద్యార్థులను ఎంపిక చేసి తమ కళాశాల/ పాఠశాలకు సంబంధించిన వారిని ధృవీకరణ పత్రం ఇచ్చి పంపవలెనన్నారు. వ్యాసరచన, వకృత్వ పోటీలు తెలుగు మరియు ఇంగ్లీషు భాషలలో నిర్వహించబడునన్నారు.. పైపోటీలలో పాల్గొనేవిద్యార్థినీ, విద్యార్థులు పోటీలు జరుగు తేదీలలో పోటీ సమయమునకు అర గంట ముందుగా తమ పేర్లను తప్పకుండా కార్యాలయములో రిజిస్టర్ చేయుంచుకొనవలెనన్నారు.
పై పోటీలలో పాల్గొని విజేతలైన వారికి సంబంధించిన ప్రశంసా పత్రము మరియు బహుమతులు తేది.20-11-2025 ముగింపు సందర్భముగా ముఖ్య అతిధిచే అందజేయబడునని అన్నారు. ఇతర వివరాలకు మొబైల్ నెం. 9494921357, 9848661374, లలో సంప్రదించగలరని అన్నారు.

# రజకులను ప్రభుత్వం ముందుచూపు

### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొలి సమయం తొర్రూర్ నవంబర్ 12రజకుల సమస్యల పరిష్కారాన్నికి కృషి చేస్తానని యశస్విని రెడ్డి అన్నారు.తొర్రూర్ పట్టణలోని రజకులు పలు సమస్యలతో కూడిన వినతి పత్రంను పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యక్రమం ఎమ్మెల్యే యశ్విని రెడ్డి కి అందజేశారు.గత ప్రభుత్వంలో మంజూరు అయిన దోబీ ఘాట్ నిర్మాణం పూర్తి అయిన ఇప్పటి వరకు కరెంట్ లేక ప్రారంభానికి నోచుకోలేదు.గతంలో మంజూరు అయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని చేపట్టాలని.రజకులకు గతం ఇచ్చిన 250 యూనిట్ల ఉచిత కరెంటు బిల్లును విషయం పైన చొరవ చూపాలి అని ఎమ్మెల్యేకి వినతి పత్రం రజక సంఘం సభ్యులు అందచేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ... దోబీ ఘాట్ కి ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేసి దోబీఘాట్ ని త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. పై సమస్యలపై దశలవారీగా చర్యలు చేపట్టి అన్ని విధాలుగా రజకులను ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, సత్తయ్య,వెంకన్న, వెంకటేష్, రాజు, మధు, మల్లేష్,చంటి, శ్రవణ్, ప్రవీణ్, నరేష్,కార్తీక్, మనోజ్, వేణు తదితరులు పాల్గొన్నారు.



# ఇల్లందు జమియత్ బి ఎ బిఉలామా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

తొలి సమయం, ఇల్లందునవంబర్, 13.ఇల్లందు జమియత్ - ఎ - ఉలమా ఆధ్వర్యంలో ఇల్లందు పట్టణం లోని అయితా ఫంక్షన్ హాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని దీన్ని ఇల్లందు పట్టణ పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇనాయతుల రషిది , హౌస్ భాయ్,కోరారు.ఇండోకేర్ హాస్పిటల్ ఖమ్మం వారిచేనిర్వహించే ఉచిత వైద్యశిబిరంలోడా॥ ఫయ్యాజ్ షేక్, ఎండి. టెస్ట్ ఫిజిషియన్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు ఈ శిబిరంలోదీర్ఘకాలిక దగ్గు,అలెర్జీ %డ% అస్తమా క్షయ(టీ.బి.), గురక, న్యూమోనయా,ఫ్లూరల్ ఎఫ్యూషన్, సైనసైటీస్,ఛాతినొప్పి, షుగర్ (డయాబెటిస్) నిద్ర సమస్యలుఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షగుండె పరీక్ష (ఇ సి సి), 2డి ఎకో పరీక్ష లనుడాక్టర్ సయ్యద్ జియా హుస్సేన్ ఎం డి, డి ఎం కార్డియాలజీ, జాగృత్ హాస్పిటల్ రి వెంకటేశ్వర హాస్పిటల్ వారిచే



గుండెకు సంబంధించిన అన్నీ సమస్యలు చూస్తారని తెలిపారుఆదివారం ఉదయం 08:30 నుండి మధ్యానం 04:00 వరకు జరిగే వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.
ఈ సమావేశంలో ముఫ్తీ ఇలియాస్ కాష్ మీ, ముఫ్తీ అమానా తుల్లా, మాల్వి సర్వర్, ఆఫీస్ అఖిల్, ఆఫీస్ ఇబ్రహీం, యాకుబఆలం, అబ్రార్, అబ్దుల్ రెహమాన్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

దిన పత్రిక
తొలి సమయం
గురువారం 13 నవంబర్ 2025

### విద్యార్థి సంఘాల దాడిని ఖండిస్తూ నిరసన ర్యాలీ.

### ప్రైవేట్ పాఠశాలల విద్యాసంస్థల బందు




తొలి సమయం తొర్రూరు నవంబర్ 12తొర్రూరు మండల కేంద్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రైవేట్ పాఠశాలల విద్యాసంస్థల బందులో భాగంగా తొర్రూర్లో నిరసన ర్యాలీ చేపట్టిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఉపాధ్యాయులు.హనుమకొండ లో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలపై విద్యార్థి సంఘాల దాడిని ఖండిస్తూ నిరసన ర్యాలీ. ర్యాలీలో పాల్గొన్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఉపాధ్యాయులు.ఎంతోమంది నిరుద్యోగులకు ఆశ్రయం కల్పిస్తూ, అన్ని వర్గాల వారికి సహకరిస్తూ పాఠశాలలు నడుపుకుంటున్నామని అందరూ సహకరించినప్పుడే పాఠశాలలు నడపగలుగుతామన్నారు.ఇలాంటి దాడులు పునరావతం కాకుండా దోషులపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యం డిమాండ్.

### చలో ఢిల్లీ దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన



తొలి సమయం నర్సింహులపేట నవంబర్ 13 :ఈనెల 17న చలో ఢిల్లీ పోగ్రామ్ ను విజయవంతం చేయండి ,నరసింహులు పేట మండలంలోని ఎస్సీ కాలనీలో మందుల పరశు రాములు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది, ఈ సమావేశం లో మహబూబాబాద్ జిల్లా ఎంఆర్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బేతోల్ కిరణ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు జడ్జి సీజే గవాయి గారిపై జరిగిన దాడిని నిరసిస్తూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు చలో ఢిల్లీ దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమాన్ని నరసింహులుపేటలోని దళితులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మరియు గార్ల మండలం ఇన్చార్జి దూడ పంగు శ్రీనివాసరావు మాదిగ, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఇరుగురవి, జిల్లా ప్రధాన కార్యదర్శి పడిదల అజిత్, జిల్లా కార్యదర్శి కొమిర ఉపేందర్, దూరు వెంకటేష్, మందుల శీను, ఎర్ర గోపి, ఎర్ర అభి, తదితరులు పాల్గొన్నారు.

### ఇల్లందు నియోజకవర్గంలో నిలిచిన చేప పిల్లల పంపిణీ కార్యక్రమం



తొలి సమయం, ఇల్లందునవంబర్, 13తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపల ఉత్పత్తిని పెంచడంతో పాటు, మత్స్యకారుల ఆదాయం పెంపు, మరియు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా చేపలు పెంచడానికి అనువైన అన్ని ప్రభుత్వ చెరువులు 100% ఉచితంగా చేప పిల్లలు పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.ఇల్లందులో చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కోరం కనకయ్య. చేప పిల్లల సైజు పై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే. నియోజవర్గంలో ఈ చేప పిల్లల పంపిణీ వద్దని ఎమ్మెల్యే అభ్యంతరంతో నిలిచిన పంపిణీ కార్యక్రమం.

### పుష్పాలంకరణ వేడుకలో పాల్గొన్న మల్లిబాబు యాదవ్





తొలి సమయం, కామేపల్లినవంబర్, 13. కామేపల్లి మండలం, పండితాపురం గ్రామానికిచెందిన మండల కాంగ్రెస్ నాయకులు శీలం పుల్లయ్య మనవరాళ్లుచి. రిత్విక పుష్పాలంకరణ లిఖిత్ రోషన్ ,ల పంచ కట్టు వేడుక ఖమ్మంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి, మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని చిరంజీవు లను అక్షింతలు వేసి దగ్గరికి తీసుకుని ఆశీర్వదించారు. కరోనా సంక్షోభ సమయంలోవారి కన్న తండ్రి శీలం ముత్తారావు కేవలం 27 సంవత్సరాల వయసులో మరణించడం చాలా విషాదకరమని, అయినా పిల్లలు ధైర్యంతో పాఠశాలకు వెళ్లి ఉన్నతంగా ప్రథమ శ్రేణిలో చదవటం చాలా గొప్ప విషయమని, ఇలాంటి పిల్లలను భగవంతుడు చల్లగా చూడాలని ఆశీర్వదించారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా నన్ను అడగమని, తప్పకుండా సహాయం చేస్తానని వారి తల్లి అపర్ణ కు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో 28వ డివిజన్ కార్పొరేటర్ గజ్జల వెంకటేశ్వర్లు,మండల మైనారిటీ నాయకులు ఎస్.కె రబ్బానీ పాషా, మేకల లక్ష్మీనారాయణ, జక్కంపూడి వెంకటేశ్వర్లు మండల ఎల్ హెచ్ పి ఎస్ అధ్యక్షులు భూక్యా నాగేంద్రబాబు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, గుగులోతు రవి, ఉబ్బని నాగార్జున చల్ల మల్లయ్య, దేరంగుల తిరపయ్య చల్ల పెద్ద మల్లయ్య, శీలం జమాలు చొప్పరి వెంకన్న బంధువులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో మిగిలిన సీట్లను మెరిట్ ప్రకారం భర్తీ చేయాలి..

### జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ సమన్వయ అధికారి బి జాక్వెలిన్..

తొలి సమయం మహబూబాబాద్, నవంబర్.13 మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మహబూబాబాద్ జిల్లాలో (5) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలైన 1. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల (బాలికలు), మహబూబాబాద్, 2. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల (బాలికలు), నర్సింహులపేట 3. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల (బాలికలు), ఇనుగుర్తి 4. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల (బాలికలు), తొ(రూర్ 5. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల (బాలురు), మరిపెడ లలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుండి 9 వ తరగతులలో మిగిలి ఉన్న సీట్లు మెరిట్ ఆర్డర్ ప్రకారము భర్తీ చేయుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మహబూబాబాద్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ సమన్వయ అధికారి, బి. జాక్వెలిన్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు.కావున ప్రవేశ పరీక్ష వ్రాసి సీటు కేటాయించబడని అర్హత కలిగిన విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు సంబందించిన నిర్ణీత దరఖాస్తు ఫారములు పైన తెలిపిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అందుబాటులో ఉన్నవని కావున ఆసక్తి గల విద్యార్థులు నిర్ణీత దరఖాస్తు నమూనా తో పాటు ఎగ్జామ్ రాసినటువంటి హాల్ టికెట్, ర్యాంక్ కార్డు ఆధార్ కార్డు జిరాక్స్ మరియు కుల, ఆదాయ ధృవీకరణ పత్రములు జిరాక్స్ జతపరిచి 15-11-2025 తేది సాయంత్రం 5.00 గంటల లోపు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల (బాలికలు), కొత్త బస్టాండ్ పక్కన మహబూబాబాద్ నందు ఇవ్వవలెనని అన్నారు. ఇతర వివరములకు వెబ్ సైట్ (https://mahabubabad.telangana.gov.in) ను సందర్శించగలరని పేర్కొన్నారు.

విద్యార్థులు నుండి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి మెరిట్ ఆధారంగా ఖాళీలకు అనుగుణంగా సంబంధిత సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీట్ల కేటాయింపు జరుగుతుందని మరియు సంబంధిత స్కూల్ వారిగా సీట్లు కేటాయించబడిన విద్యార్థులు జాబితా తేది: 24-11-2025 న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల (బాలికలు), కొత్త బస్టాండ్ పక్కన మహబూబాబాద్ నందు నోటీసు బోర్డ్ పై ఉంచబడునని మరియు మహబూబాబాద్ జిల్లా వెబ్ సైట్ (%ట్రైజూం://ఝట్రఖఎబఝఝన్.వశ్రీఖఅస్త్రఖఖ.ట్రశీజ.అఅ%) నందు పొందుపరచబడునన్నారు. అట్టి ఎంపికైన విద్యార్థులకు వారి రిజిస్టర్డ్ మొబైల్ కి %చీ×జ% ద్వారా కూడా సందేశము పంపబడుతుందని సీటు కేటాయింపు జరిగిన విద్యార్థులు సంబంధిత పాఠశాలలో తేది: 29-11-2025 సాయంత్రం 5.00 గంటల లోపు ఒరిజినల్ డాక్యుమెంట్స్ తో అడ్మిషన్ పొందవలెనని తెలిపారు. పై తేదీలోపు అడ్మిషన్ పొందని విద్యార్థుల స్థానంలో అర్హత కలిగిన ఇతర విద్యార్థులకు మెరిట్ లిస్టు ప్రకారము సీట్లు భర్తీ చేయుబడునని పేర్కొన్నారు

# ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈనెల 14నుండి అర్చరీ టోర్నమెంట్..

### ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుట్ట శంకరయ్య..

తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 12: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఆర్చరీ జూనియర్ బాల బాలికల మరియు ఆర్చరి సీనియర్ స్త్రీపురుషుల టోర్నమెంట్,కం -ఎన్నిక 14 వ తారీకు ఉదయం 7 గంటలకు కిన్నెరసాని మోడల్ డ్రైవర్ స్పోర్ట్స్ స్కూల్ నందు జరుపబడునని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్చరీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుట్ట శంకరయ్య ప్రెస్ నోట్ ద్వారా తెలిపిన టోర్నమెంట్ వివరాల ప్రకారం...

ఎంపికైన ఆర్చర్లు తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆర్చరీ పోటీలలో ఖమ్మం జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు.

పోటీ వివరాలు: జూనియర్ బాల బాలికలు
ఇండియన్ రౌండ్ : 40 మీటర్లు మరియు 30 మీటర్లు
రికర్వు రౌండ్ : డబుల్/70మీటర్స్
కాంపౌండ్ రౌండ్ : డబుల్ /50 మీటర్స్
సీనియర్ స్త్రీ పురుషులు
ఇండియన్ రౌండ్ : 50 మీటర్స్ మరియు 30 మీటర్లు
రికార్వ్ రౌండ్:డబుల్ /70మీటర్స్
కాంపౌండ్ రౌండ్ : డబుల్ / 50 మీటర్స్



హర్వతలు: 2005 జనవరి 1 ఆ తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులు మరియు జనన ధ్రువీకరణ పత్రము సమర్పించాలి కావున పోటీలో పాల్గొని వారు 13వ తారీకు లోపున ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆశ్చర్య అసోసియేషన్ వాట్సప్ గ్రూప్ లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలి,ప్రత్యక్షంగా పంపిన ఎంట్రీలు పరిగణలోకి తీసుకున్న బడువు అని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుట్ట శంకరయ్య తెలిపారు..

టోర్నమెంట్ లో పాల్గొని కన్వీనర్లు బి చందు హెడ్మాస్టర్ కిన్నెర మోడల్ స్పోర్ట్స్ స్కూల్ పాల్వంచ మండలం
ఎస్ బాలసుబ్రహ్మణ్యం ఫిజికల్ డైరెక్టర్ సెల్ నెంబర్ 97059 778 98
టోర్నమెంట్ ఆర్గనైజేషన్ మెంబర్స్:
జి మారప్ప కోచ్ మొబైల్ 939 8284966
కే కళ్యాణ్ కోచ్ మొబైల్ నెంబర్ 9 95157 23 780
పి నగేష్ కోచ్ సెల్ నెంబర్ 95730 16 729

# తెలంగాణ పెరిక కుల సంఘ రాష్ట్ర అధ్యక్షులుగా యర్రంశెట్టి ముత్తయ్య

### గౌరవ అధ్యక్షులుగా లక్కర్సు ప్రభాకర్ వర్మ

తొలి సమయం మహబూబాబాద్ నవంబర్ 13:పెరిక కుల (పురగిరి క్షత్రియ) సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యర్రంశెట్టి ముత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్ కుతుబుల్లాపూర్ లో బుధ, గురువారం రెండు రోజుల పాటు జరిగిన తెలంగాణ రాష్ట్ర సదస్సులో రాష్ట్ర కో ఆర్డినేటర్లు, వివిధ జిల్లాల నుండి వచ్చిన నాయకులు, కుల పెద్దల సమక్షంలో నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా లక్కర్స్ ప్రభాకర్ వర్మ, అసోసియేట్ అధ్యక్షులుగా ఆక రాధాకృష్ణ, సాగాని హరికృష్ణ లను, ముఖ్య సలహాదారులుగా రాష్ట్ర వికలాంగుల సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, సీనియర్ నాయకులు చింతం లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నారు.

రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన యర్రంశెట్టి ముత్తయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పెరిక పెద్దలు ఎంతో నమ్మకంతో నన్ను రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కుల పెద్దలు సూచించిన విధంగా పెరిక కుల ప్రజలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి శక్తికి మించి కృషి చేస్తానని అన్నారు. పెరిక కుల ప్రజలను సామాజికంగా ఆర్థికంగా, వ్యాపారపరంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించి ప్రభుత్వం, కుల పెద్దల సహకారంతో అమలు చేస్తానని అన్నారు. శ్రమలో, ఉత్పత్తిలో కీలకపాత్ర పోషించే పెరిక కుల ప్రజలు రాజకీయాల్లో కూడా స్వయం కృషితో ఎదుగుతున్నారని, విద్య, ఉద్యోగాల్లో కూడా అత్యున్నత స్థాయికి ఎదుగుతున్నారని, కుల సంఘం నుండి సహకారం, ప్రోత్సాహం అందిస్తే మరింత అభివృద్ధి చెందుతారని అన్నారు. బి.సి ఉద్యమ శకం నడుస్తున్న నేటి రోజుల్లో పెరిక కుల ప్రజలను బి.సి ఉద్యమాల్లో ప్రత్యేక స్థానం కల్పించే దిశగా ముందుకు సాగుదామని అన్నారు.

గతంలో సంఘానికి నాయకత్వం వహించిన వారు ఒంటెద్దు పోకడలతో సంఘాన్ని భ్రష్టు పట్టించారని, వ్యక్తిగత ప్రతిష్ట కోసం పాకులాడి సంఘాన్ని, కుల ప్రజలను అభివృద్ధిని మరిచారని, ప్రశ్నించిన వారిని పక్కకు నెట్టి ఆధిపత్యంతో సంఘాన్ని, సంఘ ఆస్తులను కైవసం చేసుకొని కుల ప్రజలకు నష్టం చేస్తున్నారని అన్నారు. పెరిక కులం అంటే ఒక్క హైదరాబాద్ లోనే లేదని, ఒక్క హైదరాబాద్ లోనే భవనాలు కట్టడంలో ఆంతర్యం ఏమిటని? హైదరాబాద్ నగరంలో ఉన్న సంపన్న పెరిక కులస్తులు కూటమిగా ఏర్పడి రాష్ట్ర సంఘాన్ని కైవసం చేసుకున్న విషయం రాష్ట్రంలోని పెరిక





కులస్తులు గమనించారని, అందుకే ప్రజాస్వామ్యబద్ధంగా కొత్త సంఘాన్ని ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. కొత్తగా ఎన్నుకోబడిన సంఘం 33 జిల్లాల్లో పెరిక కుల ఆత్మగౌరవ సంఘాలు నిర్మించి అందులో హాస్టళ్లను నిర్వహించి అందులో రాజకీయ, విద్య శిక్షణలు ఇస్తామని అన్నారు.

అప్రజాస్వామిక కమిటి వైదొలగాలి

రాష్ట్ర, జిల్లా సంఘాలకు ఉన్న ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఇటీవల ఎన్నుకోబడిన రాష్ట్ర కమిటి వెంటనే రాజీనామా చేసి వైదొలగాలని కొత్తగా ఎన్నుకోబడిన కమిటి తీర్మానం చేశారని ఆయన అన్నారు. రాజకీయాలకు అతీతంగా నడపాల్సిన కుల సంఘాన్ని రాజకీయ పార్టీలకు తాకట్టు పెడుతున్నారని, గత పార్లమెంటు ఎన్నికల నుండే పెరిక కుల రాష్ట్ర సంఘాన్ని రాజకీయ పార్టీకి తాకట్టు పెట్టి వాళ్ల ఇష్టానుతీరుగా ప్రవర్తిస్తూ కులానికి చెడ్డ పేరు తెస్తున్నారని అన్నారు. ఒక రాజకీయ పార్టీకి కొమ్ముకాయడం వల్ల రాష్ట్ర పెరిక కుల ప్రజలకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. కుల సంఘంలో ఏనాడు పనిచేయని వారు ఏకంగా పెరిక సంఘం రాష్ట్ర నాయకులుగా ఎన్నుకున్నామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. అప్రజాస్వామికంగా నియమించబడిన కమిటికి రాష్ట్రంలోని కులస్తులు, ప్రభుత్వ పెద్దలు, రాజకీయ నాయకులు, ఇతర సామాజిక సంఘాలు ఎవరూ గుర్తించకూడదని, సహకరించకూడదని తెలిపారు.

కొత్తగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు యర్రం శెట్టి ముత్తయ్య, వారి కమిటీకి కుల పెద్దలు మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, బొలిశెట్టి రంగారావు, బరుపటి ప్రసాద్, అంకతి ఉమా మహేశ్వర్ రావు, గజ్జెల వెంకన్న, పూజారి వెంకటేశ్వర్లు, చిడెమ్ మోహన్ రావు, బొలుగొట్టు శ్రీనివాస్, కానిగంటి శ్రీనివాస్, డాక్టర్ కౌలయ్య, బోడకుంట్ల సుధాకర్, గంపా నాగరాజు, ధనేకుల కృష్ణ, నట్టే మోహన్ రావు, అంకతి వెంకటరమణ, దిడ్డి మోహన్ రావు, శ్రీరామ్ వీరయ్య, దిడ్డి నరేందర్, సందెసాని నరేష్, శ్రీధర్ల జగదీష్, అప్పని సతీష్, సైదులు తదితరులు అభినందనలు తెలిపారు.

# త్రికోటేశ్వర స్వామి



**పరమేశ్వరుడు జ్ఞానోపదేశం ఇచ్చిన పవిత్ర పుణ్యక్షేత్రమే కోటప్పకొండ. సృష్టికర్త బ్రహ్మదేవునికే జ్ఞానోపదేశం ఇచ్చిన ప్రదేశంగా యుగయుగాల నుంచి ఖ్యాతిచెందింది. 'చేదుకో కోటయ్య.. మమ్మాదుకోవయ్యా...' అంటూ యల్లమంద కోటయ్యగా ప్రజల పూజలందుకొనే త్రికోటేశ్వరస్వామి వారి దేవాలయం గుంటూరు జిల్లా నరసరావు పేట సమీపంలోని కోటప్పకొండ గ్రామంలో ఉంది. మహాశివరాత్రి పర్వదినాల్లో అత్యంత రద్దీగా భక్తజనంతో నిండిపోతుంది.**

### దేవాలయ చరిత్ర

దీనికి కచ్చితమైన ఆధారాలేమి లేకపోయినప్పటికీ శాసనాల ఆధారంగా ఈ ఆలయాన్ని క్రీ.శ 1172లో నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. ఈ ప్రాంతాన్ని పాలించిన రాజులలో ఒకరైన విజయనగర చక్రవర్తి శ్రీ క ృష్ణదేవరాయలు భూరి విరాళాలు ఇచ్చారని శాసనాలు తెలుపుతున్నాయి. కోటప్ప కొండ ఎత్తు 1587 అడుగులు. త్రికోటేశ్వర స్వామి ఆలయం 600 అడుగుల ఎత్తులో ఉంది. ఈ కొండను ఏ కోణం నుంచి చూసిన మూడు శిఖరాలు కనబడుతుంటాయి. అందుకే దీనికి త్రికూటాచలమనే పేరు వచ్చింది. ఈ మూడు శిఖరాలను బ్రహ్మ, విష్ణు, రుద్ర రూపాలుగా భావిస్తారు.

### పురాణ కథనం

శివుడు దక్ష యజ్ఞాన్ని భగ్నం చేసిన తరువాత బాలదక్షిణామూర్తి అవతారంలో బాలునిగా మారి కైలాసంలో కఠిన తపస్సును ఆచరిస్తూంటాడు. ఆ సమయంలో బ్రహ్మ దేవతలందరితోను కలిసి దక్షిణామూర్తిని సందరిస్తాడు. స్వామి వారిని మాకు జ్ఞానబోధ చేయమని వేడుకుంటారు. అప్పుడు పరమేశ్వరుడు త్రికూటాచలానికి వస్తే జ్ఞానాన్ని ఇస్తానని చెప్తాడు. అప్పుడు బ్రహ్మతో పాటు ఇతర దేవతలందరు కూడా త్రికూటాచలానికి వస్తారు అప్పుడు శివుడు త్రికూట కొండపైనే వెలసి వారందరికి జ్ఞానోపదేశాన్ని బోధిస్తాడు. ఆ ప్రదేశంలో ఉన్న గుడికే పాత కోటప్పగుడి అని పేరు. ఆలయం లోపలి లింగం కేవలం ఒక్క అడుగు మాత్రమే ఉంటుంది. గుడి ఉన్న శిఖరాన్ని రుద్ర శిఖరమని, పక్కన ఉన్న శిఖరాన్ని విష్ణు శిఖరమని అంటారు. దక్ష యజ్ఞం సమయంలో హవిస్సును స్వీకరించిన పాపం పోవడానికి విష్ణువు ఈ శిఖరం పై తపస్సు ఆచరిస్తాడు. అప్పుడు శివుడు ప్రత్యక్షమై త్రిశూలంతో నేల మీద పొడుస్తాడు. అలా పొడిచినప్పుడు ఏర్పడ్డ రంధ్రాల నుంచి వచ్చిన జలాన్ని స్వీకరించి స్నానమాచరిస్తే సకల పాపాలు తొలుగుతాయని చెప్తాడు. విష్ణువు శివుడు చెప్పిన విధంగా చేసి తన పాపాలను పోగొట్టుకుంటాడు. ఆ విధంగా ఇక్కడ వెలసిన శివున్ని పాపవినాశనేశ్వరుడనే పేరుంది. రుద్ర శిఖరానికి నైరుతి భాగంలో ఉన్న శిఖరానికి బ్రహ్మ శిఖరమని పేరు. రుద్రవిష్ణు శిఖరాలపై స్వయంభువుగా లింగాలు వెలిశాయి. కానీ బ్రహ్మ శిఖరం పై ఏమి లేకపోవడంతో బాధపడిన బ్రహ్మ శివుని కోసం తపస్సు చేసి లింగావిర్భవం అయ్యేటట్లు చేస్తాడు.

ఈ ప్రదేశానికి తూర్పున మునిమంద/ ఎల్లమంద అనే పేర్లు గల చిన్న పల్లెటూరు ఉంది. ముందుగా బ్రహ్మదిదేవతలంతా ఈ ప్రదేశంలో ఉన్నారని అందుకే ఈ ప్రాంతానికి ఆ పేరు వచ్చిందని ప్రశస్తి. బ్రహ్మ శిఖరం మీద ఉన్న లింగానికే కొత్త కోటప్పకొండ అని పేరు.

### మహాభక్తురాలు.. ఆనందవల్లి..

స్థలపురాణం ప్రకారం శివభక్తుడైన సాలంకయ్యకు శివఅనుగ్రహంతో ఐశ్వర్యం లభిస్తుంది. పరమేశ్వరుడు కొన్ని రోజుల పాటు జంగమదేవర రూపంలో అతని ఇంటికి వచ్చేవాడు. కొన్నాళ్లకు కనిపించలేదు. దీంతో సాలంకయ్య నిరాశ చెందాడు. ఆ సమయంలోనే ఒక దంపతులకు ఆనందవల్లి అనే పాప జన్మించింది. పెరిగేకొద్దీ శివునిపై భక్తి పెంచుకొని శైవగీతాలు ఆలపించేది. కొంతకాలం అనంతరం తపస్సు చేయడంతో స్వామి ప్రత్యక్షమయ్యారు. ఆనందవల్లి ప్రతిరోజూ రుద్రాచలానికి వచ్చి శివలింగానికి పూజలు నిర్వహించేది. ఈ సంగతి తెలుసుకున్న సాలంకయ్య తనకు కూడా శివదర్శనం ఇప్పించాలని కోరాడు. అయితే ఆమె అంగీకరించక శివుని ఆరాధనలో కొనసాగింది. ఒక రోజు అభిషేకం కోసం జలం తీసుకువెళు తుండగా నీటి కొరకు ఒక కాకి బిందె మీద వాలింది. దీంతో ఆగ్రహించి కాకులు ఇక్కడకు రాకూడదని శాపం పెట్టింది. ఇప్పటికీ కాకులు ఈ క్షేత్రంలో రాకపోవడం విశేషం. ఆమె భక్తికి మెచ్చిన పరమేశ్వరుడు ఆమెను కుటుంబజీవితం కొనసాగించమని బ్రహ్మచారిణిగా ఉన్న ఆమెను గర్భవతిగా మారుస్తాడు. అయినా ఆమె శివారాధన చేయడం మానలేదు. ఆమె భక్తికి మెచ్చిన ఈశ్వరుడు ప్రత్యక్షమై తానే ఆమె వెంట వచ్చి పూజలు స్వీకరిస్తానని అయితే ఇంటికి వెళ్లే సమయంలో తిరిగి చూడకుండా వెళ్లాలని ఆజ్ఞాపిస్తాడు. ఆనందవల్లి కొండ మెట్లు దిగుతూ ఒక చోట కుతూహలం కొద్దీ వెనక్కు తిరిగి చూడటంతో స్వామి వెంటనే అక్కడ వున్న గుహలో లింగరూపం ధరించాడు. ఆనందవల్లికి కుమారుడు జన్మించాడు. తాను వెనక్కు తిరిగిచూడటంపై వల్లి బాధపడింది. మరణానికి సిద్ధం కావడంతో పరమేశ్వరుడు ప్రత్యక్షమవుతాడు. ఆ సమయంలో బాలుడు కూడా అద ృశ్యమవుతాడు. ఇదంతా శివమాయ అని ఆనందవల్లి గ్రహిస్తుంది. అనంతరం శివునిలో ఆమె ఐక్యమైంది. మహాశివరాత్రి సందర్భంగా ప్రభల ప్రదర్శన అత్యంత వైభవంగా సాగుతోంది. జంగమయ్య చిత్రాలతో చిన్న ప్రభల నుంచి భారీ ఎత్తున ప్రభలను వూరేగింపుగా తీసుకువస్తారు. కొన్ని ప్రభలు యాభై అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉండటం విశేషం. గతంలో ఎడ్లబండ్లలో తీసుకువచ్చేవారు. ప్రస్తుతం ట్రాక్టర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు.

### దర్శన వేళలు

ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మళ్లీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఉంటుంది. స్వామివారికి అర్చన, ఉచిత దర్శనం సమయంలో తీసుకుంటే రూ.5 టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇది కాకుండా ప్రత్యేక దర్శనం రూ.75, అష్టోత్రం రూ.100, అభిషేకం దంపతులకు మాత్రమే రూ.200, పంచ హారతి ఒక్కొక్కరికి రూ.100, పిల్లలకు అన్నప్రాసన చేయిస్తే రూ.150, అక్షరాభ్యాసం చేయిస్తే రూ.150 వీటితో పాటు వాహన పూజలు చేయించుకోవచ్చు. నవగ్రహ పూజ, శనిత్రయోదశి సందర్భాల్లో రూ.200 చెల్లించి పూజలు చేయించుకోవాలి. శాంతి యాదశాల పూజకు రూ.1116లు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం (ఒకే కుటుంబానికి) రూ.1116లు చెల్లించాల్సి ఉంటుంది. మూలవిరాట్ అభిషేకం పర్వదినాల్లో అయితే రూ.400 చెల్లించాలి. ఇవి కాకుండా ప్రత్యేక స్కీములు ద్వారా కూడా స్వామివారికి పూజలు నిర్వహిస్తారు. జీవితకాల అభిషేకం (పదేళ్లు) రూ.2116లు, జీవిత కాల అష్టోత్రం (10 ఏళ్లు) రూ.1116లు, నిత్య గోత్రనామ పథకం ఏడాదికి రూ.1116లు చెల్లించాలి. కొండ వద్ద వసతిగ ృహాలు ఉన్నాయి. ఆనందవల్లి అతిథిగ ృహంలో గదికి రూ.250 చెల్లించాలి. తోట వారి అతిథిగ ృహంలో అయితే రూ.300, నంది అతిథిగ ృహంలో రూ.750 చొప్పున రుసుములు చెల్లించాల్సి ఉంది. పర్యాటక క్షేత్రం కోటప్పకొండ పర్యావరణ పర్యాటక క్షేత్రంగానూ అభివ ృద్ధి చెందుతోంది. సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు పర్యాటక క్షేత్ర అభివ ృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే భక్తుల కోసం బోట్ షికారు, టాయ్ ట్రైన్, బోట్ షికారు కోసం కాళింది మడుగు, పిల్లలు ఆడుకోవడానికి వీలుగా ఆట వస్తువులతో ఏర్పాటు చేసిన పిల్లల రాజ్యం, అక్వేరియం ప్రత్యేకంగా ఆకర్షణలుగా నిలుస్తున్నాయి. త్వరలో తీగమార్గం రాబోతోంది. కార్తీక మాసం అనగానే సహజంగానే వనభోజనాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంటారు. అనేక పట్టణాల నుంచి, పిల్లల నుంచి పాఠశాలల విద్యార్థులను కార్తీక మాసంలో ఇక్కడ క్షేత్రానికి తీసుకువచ్చి అన్ని చూపించి భోజనాలు ఆయా పాఠశాలల యాజమాన్యాలే ఏర్పాటు చేస్తున్నాయి. ఇవికాకుండా కొండ కింద అన్ని సామాజిక వర్గాలకు అన్నదాన సత్రాలు ఉన్నాయి. ఇక్కడ ఈ సత్రాలకో ప్రత్యేకత ఉంది. గతంలో అయితే పండుగల సమయంలోనే ఉచిత భోజనం ఉంది. ఇప్పుడు భక్తులు ముందుగా వచ్చి చెబితే నిత్యం భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ, గుంటూరు వైపు నుంచి వచ్చే యాత్రికులు చిలకలూరిపేట మీదుగా, నరసరావుపేట మీదుగా కూడా కోటప్పకొండకు చేరుకోవచ్చు. సత్తెనపల్లి, పెదకూరపాడు ప్రాంతాల భక్తులు నరసరావుపేట మీదుగానే కోటప్పకొండకు చేరవచ్చు. మాచర్ల, గురజాల, కారంపూడి యాత్రికులు కూడా నరసరావుపేట మీదుగా కోటప్పకొండకు వెళ్లే మార్గం ఉంది.

# కాణిపాకం-వినాయకుడు

**సత్య ప్రమాణాలకు నెలవుగా.. అసత్యాలు చెప్పేవారికి సింహస్వప్నంగా చిత్తూరు జిల్లా కాణిపాకం- శ్రీ వరసిద్ధి వినాయకుని ఆలయం భాసిల్లుతోంది. కాణిపాకం వద్ద బహుదా నది ఒడ్డున ఈ ఆలయం ఉంది. సర్వమత ఆరాధ్యుడుగా కాణిపాకం వరసిద్ది వినాయకుడు పూజలందుకుంటున్నారు. ఈ స్వామికి హిందువులే కాదు. ఇతర మతస్థులూ మొక్కులు తీర్చుకుంటారు. ముఖ్యంగా స్వామివారి దర్శనార్థం నిత్యం వందల సంఖ్యలో ముస్లింలు రావడం విశేషం. దేవుడు ఒక్కడే అన్న నిదర్శనం ఇక్కడ కనిపిస్తుంది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో సైతం ఇతర మతస్థులు పాల్గొంటారు. క్షేత్రచరిత్ర/ స్థలపురాణం: సుమారు 1,000 ఏళ్ల కిత్రం ఈ ఆలయ నిర్మాణం జరిగినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. పూర్వం విహారపురి అనే గ్రామంలో ధర్మాచరణ పరాయణులైన ముగ్గురు గుడ్డి, మూగ, చెవిటి వాళ్లుగా జన్మించారు. కర్మఫలాన్ని అనుభవిస్తూ.. ఉన్న పొలాన్ని సాగు చేసుకొంటూ జీవించేవారు. ఒక దశలో ఆ గ్రామం కరవు కాటకాలతో అల్లాడింది. గ్రామస్థులకు కనీసం తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా దొరకని దుస్థితి నెలకొంది. కరవును జయించాలని సంకల్పించిన ముగ్గురు సోదరులు తమ పొలంలో ఉన్న ఏతం బావిని మరింత లోతు చేయాలనుకున్నారు. ఆ మేరకు బావిలో తవ్వుతుండగా ఓ పెద్ద బండరాయి అడ్డుపడింది. దాన్ని తొలగించే యత్నంలో పార రాయికి తగిలి రాయి నుంచి రక్తం చిమ్మింది. రక్తం అంగవైకల్య సోదరులను తాకగానే.. వాళ్ల వైకల్యం తొలగింది. జరిగిన ఈ విచిత్రాన్ని తెలుసుకున్న గ్రామస్థులు ఆ స్థలానికి వచ్చి బావిని పూర్తిగా తవ్వి పరిశీలించారు. బావిలో 'గణనాథుని' రూపం కన్పించింది. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో దాన్ని పూజించి స్వామివారికి కొబ్బరికాయలు సమర్పించారు. స్వామికి గ్రామస్థులు సమర్పించిన కొబ్బరికాయల నీరు 'కాణి'భూమి( కాణి అంటే ఎకరం పొలం అని అర్థం) మేర పారింది. అప్పట్నుంచి విహారపురి గ్రామానికి 'కాణిపారకరమ్' అన్న పేరు వచ్చింది. కాలక్రమంలో అదే 'కాణిపాకం'గా మారిందని ప్రశస్తి.**



కాణిపాకం వరసిద్ధి వినాయకుడు సత్య ప్రమాణాల దేవుడిగానూ ప్రసిద్ధికెక్కారు. స్వామివారి ఎదుట ఎవరైనా తప్పుడు ప్రమాణం చేస్తే.. వారిని స్వామియే శిక్షిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వ్యసనాలకు బానిసలైన వారు (తాగుడు, దురలవాట్లు) స్వామివారి ఎదుట ప్రమాణం చేస్తే వాటికి దూరం అవుతారని భక్తుల నమ్మకం. అసెంబ్లీలో సైతం రాజకీయ నేతలు 'కాణిపాకం'లో ప్రమాణం చేద్దామా? అని సవాల్ విసురుకోవడం స్వామి మహిమను చెప్పకనే చెబుతోంది..!

నిత్యం పెరిగే స్వామి: వరసిద్ధి వినాయకుడు నిత్యం పెరుగుతున్నాడు. దీనికి ప్రత్యక్ష నిదర్శనం ఉంది. యాభై ఏళ్లనాటి వెండి కవచం ప్రస్తుతం స్వామివారికి సరిపోవడం లేదు. 2002 సంవత్సరంలో భక్తులు స్వామివారికి విరాళంగా సమర్పించిన వెండి కవచం సైతం ప్రస్తుతం స్వామివారికి ధరింపచేయడం సాధ్యం కావడం లేదు.

కాణిపాకం శివ-వైష్ణవ క్షేత్రంగా భాసిల్లుతోంది. ప్రధాన గణనాథుని ఆలయం దగ్గర్నుంచి అనుబంధ ఆలయ నిర్మాణాలకు సంబంధించి విశిష్ట పురాణ ప్రాధాన్యం ఉంది. ఒకే చోట వరసిద్ధి వినాయకస్వామి ఆలయం, మణికంఠేశ్వర, వరదరాజులు, వీరాంజనేయ స్వామి వారి ఆలయాలున్నాయి.

బ్రహ్మహత్యా పాతక నివారణార్థం: స్వయంభువు వరసిద్ధి వినాయకస్వామి గుడికి వాయువ్య దిశగా ఉన్న మణికంఠేశ్వరస్వామి ఆలయం ప్రధాన ఆలయానికి అనుబంధ నిలయం. దీన్ని 11 వ శతాబ్దంలో చోళరాజు కుళొత్తుంగ మహారాజు నిర్మించినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. బ్రహ్మహత్యా పాతక నివ ృత్తి కోసం శివుడి ఆజ్ఞ మేరకు ఈ ఆలయం నిర్మించారట! అద్భుత శిల్పకళ ఈ ఆలయం సొంతం. ఇక్కడ మహాగణపతి, దక్షిణామూర్తి, సూర్యుడు, షణ్ముఖుడు, దుర్గాదేవి విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆలయ గాలి గోపురం, ప్రాకార మండపాల్లో శిల్పకళ ఉట్టిపడే దేవతామూర్తుల ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. లోపల మరగదాంబిక అమ్మవారి గుడి ఉంది. ఇక్కడ సర్పదోష నివారణ పూజలు చేస్తారు. ఏటా అమ్మవారి ఆలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు: మణికంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రతి గురువారం దక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. ప్రత్యేక అభిషేకం, అర్చనలు చేస్తారు.

సర్పదోష పరిహారార్థం.. వరదరాజస్వామి ఆలయ నిర్మాణం

స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి వరదరాజస్వామి ఆలయ నిర్మాణం జరిగింది. గణనాథుని ఆలయానికి ఎదురుగా ఉన్న ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి పురాణాల్లో ఓ కథ ప్రచారంలో ఉంది. జనమేజయ మహారాజు చేపట్టిన సర్పయాగ దోష పరిహారానికిగానూ శ్రీ మహావిష్ణువు ఆజ్ఞ మేరకు ఇక్కడ వరదరాజస్వామి ఆలయం నిర్మితమైనట్టు చెబుతారు. ఆలయంలోని మూలవిరాట్ ఆకారంలో సుందరశిల్ప కౌశల్యం ఉట్టిపడుతుంది. ఆలయంలో నిత్యం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తుంటారు.

పంచామ ృతాభిషేకం టిక్కెట్ ధర: రూ. 550

సేవాఫలితం: స్వామివారిని పంచామ ృతాలతో అభిషేకం చేయడం పుణ్యఫలం. ఈ సేవల్లో పాల్గొనడం వలన అన్ని కష్టాలు తొలగుతాయి.

గణపతి హెూమం టిక్కెట్ ధర: 500

సేవాఫలితం: 'కలౌ చండీ వినాయకః' అంటే ఈ కలియుగమున పిలవగానే పలికే దేవతలు.. చండి(దుర్గా), గణపతి. మన దైనందిన జీవితంలో ఎన్నో విఘ్నాలు, ప్రతి పనికి పోటీ, ఏదో ఒక ఆటంకం జరగవచ్చు. అన్ని విఘ్నాలను అధిగమించాలి. అంటే గణపతిని అగ్నియుక్తంగా పూజించాలి. స్వామివారి సన్నిధిలో గణపతి హెూమం చేసుకోవడం వల్ల విఘ్నాలు తొలగిపోతాయి. సకల శుభాలు కలుగుతాయి.

గణపతి మోదకపూజ టిక్కెట్ ధర: 300

గణపతి పురాణంలో సహస్రనామాల్లో 'మోదక ప్రియాయనమః' అని ఉంది. మోదకం అంటే కుడుములు అని అర్థం. హిందువులు ఏ శుభకార్యం చేయాలన్న ముందుగా వినాయకుడికి కుడుములు నైవేద్యంగా సమర్పిస్తారు. ఆలయంలో గణపతి మోదక పూజ చేయడం వల్ల స్వామివారి అనుగ్రహం పొందుతారు.

సహస్ర , వ్రతపూజ టిక్కెట్ ధర: రూ. 150, రూ. 58

సేవాఫలితం: 'కలౌ గణేశ' స్మరణాముక్తి అన్న నానుడిని అనుసరించి స్వామివారికి 1008 నామాలు అర్పించడం వల్ల విశేషఫలం కలుగుతుంది.

మూల మంత్రార్చన టిక్కెట్ ధర: రూ. 300

సేవాఫలితం: వినాయకుని గణాధిపతిగా నియమించిన తర్వాత.. అక్కడ విష్ణుమూర్తి దర్శనమిచ్చారు. వినాయకుడు విష్ణువు చేతిలోని సుదర్శన చక్రాన్ని తీసుకున్నాడు. విష్ణువు అడిగినా తిరిగి ఇవ్వలేదు. దీనికి బదులుగా ఏదైనా వరం కోరుకొమ్మని విష్ణుమూర్తి అంటే త్రినేత్రములు గల శిరస్సు కావాలని గణపతి కోరతాడు. అప్పుడు విష్ణుమూర్తి బ్రహ్మదేవుని సహాయంతో నారికేళాన్ని స ృష్టించి ఇచ్చాడని పురాణాలు చెబుతున్నాయి. అందుకే గణపతిని అవాహనం చేసి నారికేళంతో పూజిస్తే మహాగణపతి సంతుష్టి చెందుతారు. సకల విఘ్నాలు తొలగి సుఖశాంతులు కలుగుతాయి.

సంకటహర గణపతి వ్రతం టిక్కెట్ ధర: రూ. 151

సేవాఫలితం: గణేశ పురాణంలో ఈ వ్రతానికి విశేష స్థానం కల్పించారు. దీన్ని శ్రీ క ృష్ణుడు, బ్రహ్మదేవుడు తదితరులు ఆచరించారు. సంతానం, వ్యాపార అభివ ృద్ధి, సకల విఘ్నాలు తొలగడం, ముఖ్యంగా కోర్టు వ్యవహారాల్లో జయం కలగడానికి దీన్ని ఆచరిస్తారు.

పూలంగి సేవ టిక్కెట్ ధర: రూ. 1,000

సేవాఫలితం: వివిధ రకాలైన పుష్పాలను గర్భాలయం, అంత్రాలయం, అర్ధమండపం, స్వామివారికి విశేష పుష్పాలకంరణ చేస్తారు. రంగుల పుష్పాలతో స్వామివారిని పూజించడం వల్ల లక్ష్మీ అనుగ్రహం, సౌభాగ్యం కలుగుతాయి.

అక్షరాభ్యాసం టిక్కెట్ ధర: రూ. 116

సేవాఫలితం: చదువుల తండ్రి వినాయకుడు. అలాంటి వినాయకుడి ఆలయం వద్ద అక్షరాభ్యాసం చేసుకుంటే పిల్లల చదువులు వ ృద్ధి చెందుతాయని భక్తుల నమ్మకం. ఆలయంలో నిత్యం అక్షరాభ్యాసం జరుగుతుంటుంది.

అన్నప్రాసన టిక్కెట్ ధర: రూ.116

సేవాఫలితం: పిల్లలకు అన్నప్రాసనం, విశిష్ఠరోజున చేస్తారు. విఘ్నాలను తొలగించే వినాయకుని ఆలయంలో అన్నప్రాసన చేయడం శుభం. ఇక్కడ అన్నప్రాసన చేయడం వల్ల పిల్లలకు జీవితంలో మంచి జరుగుతుంది. మొదటి పూజలు అందుకునే వినాయకుడి ఆలయంలో అన్నప్రాసన చేస్తే మంచిదని పురాణాలు చెబుతున్నాయి.

వివాహ ఆహ్వానపత్రికలకు పూజలు టిక్కెట్ ధర: రూ. 51

సేవాఫలితం: వివాహం చేసుకునే నూతన జంటలకు సంసార జీవితంలో ఎలాంటి ఒడిదొడుకులు జరగకుండా ఉండాలని వినాయకుని చెంత పూజలు చేస్తారు.

దిన పత్రిక
తొలి సమయం



# తక్కువ ఖర్చుతో సెలవుల్లో ఎంజాయ్ చేయాలనుకుంటున్నారా.. మన దేశంలో బెస్ట్ బీచ్‌లు ఇవే!





. కొందరు పల్లెటూర్లకు పయనమవుతున్నారు. ఇంకొందరు టూర్లు ప్లాన్ చేసుకొని హాయిగా ప్రయాణాలు చేస్తున్నారు. వీలైతే ఈ సమ్మర్‌లో ఈ బీచ్‌లకు వెళ్లండి. విదేశాలకు వెళ్లాలంటే పాస్‌పోర్ట్, వీసాలు కావాలి. బడ్జెట్ కూడా ఎక్కువ అవుతుంది. భారతదేశంలో ఉన్న బీచ్‌లు చూస్తే చాలు ప్రపంచంలో ఉన్న భిన్నమైన బీచ్‌లన్నింటినీ చుట్టేసినట్టే. ఈ సమ్మర్ మీకు మెమరబుల్‌గా మిగలాలంటే ఈ బీచ్‌లను కచ్చితంగా చూడాలి.

కంద్రపాలిత ప్రాంతమైన అండమాన్ నికోబర్ దీవుల్లో ఈ బీచ్‌ని నిశ్శబ్దానికి పర్యాయపదంగా చెప్తారు. స్క్యూబా డైవింగ్, ట్రెక్కింగ్, వాటర్‌గేమ్స్, వంటి ఎన్నో సాహస క్రీడలను ఇక్కడ ప్రయత్నించవచ్చు. ఇటు వెళ్తే ఒకటి రెండు రోజులు కాదు. వారం రోజుల పాటు తిరిగినా పూర్తవ్వని చూడదగ్గ ప్రదేశాలున్నాయి. సముద్రపు ఏనుగుల మీద స్వారీ అయితే చెప్పనక్కర్లేదు.

**మరారి బీచ్ :**

కేరళలో ఉన్న ప్రతీ బీచ్ అందమైందే. అలప్పిలో ఉన్న మరారి బీచ్ పట్టణానికి నాలుగు వైపులా విస్తరించి ఉంటుంది. నగరానికి దగ్గరగా ఉండడం వల్ల విదేశీయుల తాకిడి ఎక్కువ ఉంటుంది. ఒక్కసారి ఈ బీచ్‌కి వెళ్తే మైమరిచి.. ఈ ప్రపంచం నుంచి వేరే ప్రపంచానికి వెళ్తారు. ఖరీదైన రిసార్టులు ఇక్కడ ఉంటాయి. అవి స్వర్గాన్ని తలపిస్తాయి.

**మహాబలిపురం బీచ్ :**

మన దేశంలో ఉన్న అత్యంత పరిశుభ్రమైన బీచ్‌లలో ఇది ఒకటి. నిత్యం ఆకట్టుకునే పర్యాటకులు, రకరకాల వంటకాలు, కలర్‌ఫుల్ కార్యక్రమాలు బాగుంటాయి. సాయంత్రం అలల మీద సర్ఫింగ్ చేస్తుంటే చూడాలి గానీ అక్కడినుంచి రావాలనిపించదు. ఇవన్నీ ఇలా ఉంటే.. పాండవుల రథాల వంటి ఏడవ శతాబ్దానికి చెందిన ఎన్నో చారిత్రక ఆధారాలు ఇక్కడ ఉన్నాయి.

**ఒరిస్సా బీచ్ :**

గోపాల్‌పూర్ బీచ్.. ఇది ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌కు 190 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. గిరిజనులుండే ఈ ప్రాంతమంతా ప్రశాంతంగా ఉంటుంది. చుట్టూ హిందూ దేవాలయాలు, పురాతన కట్టడాలున్న ఈ ప్రాంతం పర్యాటకంగా బాగా అభివృద్ధి చెందింది. ముఖ్యంగా ఇక్కడ పోర్టులోని లైట్‌హౌజ్ అన్నింటికన్నా ప్రత్యేకం.

**ఆర్కే బీచ్ :**

విశాఖపట్టణంలోని ఆర్కే బీచ్ గురించి తెలుగు ప్రజలకు చెప్పనక్కర్లేదు. మనకు దగ్గరలో ఉన్న అతిపెద్ద బీచ్ ఇదే. ఈ బీచ్ చుట్టూ మ్యూజియంలు, గార్డెన్స్, గేమింగ్ జోన్‌లు ఇలా ఎన్నో సదుపాయాలున్నాయి. విశాఖపట్టణానికి వెళ్తే ఆర్కే బీచ్‌తో పాటు కైలాసగిరి, అరకు, బొర్రాగుహలు ఇలా చాలా పర్యాటక ప్రాంతాలను చుట్టేసి రావొచ్చు.

**గోవా బీచ్ :**

మానసిక ప్రశాంతత కోసం ఈ మధ్య కాలంలో చాలామంది వెళ్తున్న ప్రాంతం గోవా. ఒక్కటా రెండా వందల సంఖ్యలో బీచ్‌లున్న ప్రాంతం గోవా. అక్కడి భిన్న వాతావరణం సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది. గేమ్స్, డీజే నైట్స్ కొత్త లోకాల్లోకి తీసుకెళ్తాయి.

## పర్యాటకులను ఆకర్షిస్తున్న చందంపేట గుహలు.. మన తెలంగాణలోనే!



గుహలంటే బెలుం గుహలేనా? గుహలంటే బొర్రా గుహలేనా? వీటిని మించి మైమరిపించి ఆహ్లాదాన్ని పంచే గుహలు మన దగ్గర కూడా ఉన్నాయి. కానీ అవి సరైన గుర్తింపునకు నోచుకోలేదు. పర్యాటక ప్రదేశాలుగా పేరుగాంచలేదు. వసతులుంటే వనాల్లోనే ఉండి హాయిని పొందే గుహలు తెలంగాణలో కూడా ఉన్నాయి. వీలైతే చందంపేట గుహల వైపు ఓ రౌండేసి రండి.. ఎంతటి ఆనందం పొందుతారో మీరే చూడండి..తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి అందాలకు కొదువే లేదు. ఎత్తైన కొండలు, గలగలపారే జలపాతాలు అడవుల సంగతైతే ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వీటితో పాటు దర్శనీయ స్థలాలు చాలానే ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి గుహలు . గుహలు అనగానే మనకు బొర్రా గుహలు , బెలుం గుహలు గుర్తొస్తాయి. తెలంగాణలో అద్భుతమైన కళాసంపద మాత్రమే కాదు అత్యద్భుతమైన శిలా సంపద కూడా ఉన్నది.

**చల్లని చందంపేట...** కృష్ణానదీ లోయలో నల్గొండ జిల్లా చందంపేట మండలంలో ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఉండే అరుదైన గుహలున్నాయి. ఐస్‌లాండ్లోని ఒక అగ్నిపర్వతంలో కరిగి చిమ్మిన లావా వేడి,వేగాలకు ఏర్పడిన భూమికి 400అడుగుల లోతున వున్న దిహ్నుకగిగుర్ అనే గుహ ప్రకృతే స్వయంగా వేసిన హరివిల్లు రంగులతో ఏర్పడి ఉంది. నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని కాచరాజుపల్లికి దగ్గర వున్న గుట్టల వరుసలో మునులగుహగా పేరున్న గాజుబేడం గుహ ఆక్వామెరీన్ (నీలి ఆకుపచ్చ) రంగుతో మెరిసిపోతు కనపడుతుంది.

గుహలోకి ప్రవేశించే మార్గం విశాలంగా ఉంటుంది. కళ్ళుచెదిరే రంగులగోడలు, అంతస్తుల గుహలు మనల్ని అబ్బురపరుస్థాయి. ఈ మునుల గుహ లేదా భావోజి గుహలో ఏర్పడిన గుహాంతర్భాగాలు సొరంగాలుగా, అంతస్తులుగా చక్కగా చెక్కినట్టుగా రాతిగోడలు,అందమైన ఆకృతులు ఒకచోట ఎరుపు రంగు, మరొకచోట కొంచెం నారింజవర్ణం, గుహలో 90 శాతం ఆక్వామెరీన్(నీలి ఆకుపచ్చ)రంగుతో చాలా అందంగా కనపడుతున్నాయి. ఈ రాతిగోడలు ఇలా రంగులతో మెరిసిపోతున్నాయంటే అగ్నిపర్వతంలో లావా ప్రవాహంతో ఇట్లాంటి గుహలు ఏర్పడివుంటాయి. లావావేడికి కరిగిన వివిధ ఖనిజాలు కలిసిపోవడంతో ప్రాకృతికంగా గుహలగోడలకు ఈ రంగులు వచ్చి ఉంటాయి . ఈ గుహలోని రాళ్ళు ఖనిజసంపన్నమైనవి. ప్రభుత్వం వీటిని పరీక్షించి వీటిలోని ఖనిజాలను అన్వేషించాలి. అంతేకాదు దేశంలోనే అరుదైన ఈ గుహలకు మంచిదారులు వేసి విహార యాత్రాస్థలంగా రూపొందించాలి.ప్రభుత్వం దృష్టిపెడితే ప్రతిష్టాత్మకంగా మారడమే కాక రేపటి పర్యాటక సంపదకు కూడా మూలకారణం అయ్యే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. గుహలోని మార్గాలను అన్వేషిస్తే అనేకమైన కొత్తసంగతులు, ఆశ్చర్యపరిచే చారిత్రక విశేషాలు బయటపడే అవకాశాలున్నాయి. సహజమైన అందాలు పర్యాటకానికి అవసరమైన అన్ని హంగులనూ సొంతం చేసుకుంది చందంపేట మండలం. దేవరచర్లలోని పురాతన శివాలయంతో పాటు గాజు బేడం గుహలు, మునిస్వామి గుట్ట దగ్గర ముని స్వామి, ఏలేశ్వరంలో మల్లయ్యస్వామి ఆలయాలు పుష్కరాలకు వేదికలు. దేవరచర్ల సమీపంలోని మునిస్వామిగుట్టలో జలపాతం దగ్గరి శివలింగం ఆధ్యాత్మిక అనుభూతికి లోను చేస్తుంది. గాజు బెడం గుహలు కాచరాజుపల్లి అటవీప్రాంతంలో ఉన్నాయి. వైజాగ్ కాలనీ నుంచి కృష్ణానదిలో ప్రయాణిస్తే కొండల మధ్య కృష్ణా నది పరవళ్లు తీసే దృశ్యాలు పాపికొండలను తలపిస్తాయి.

**మైమరిపించే మైలారం...** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పాండవుల గుట్టకి చేరువలో ఉన్న మైలారం గుహలు లక్షల సంవత్సరాల నాటి ఆనవాళ్లకు, ప్రకృతి చెక్కిన అందాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి. నల్లగుట్టలుగా పేరొందిన నల్లరాతి గుట్టలలో 3.5 కి.మీ. మేర ఈ సున్నపు గుహలు విస్తరించి ఉన్నాయి. ఇలాంటి గుహలు మన దేశంలో ఉత్తరాఖండ్, హర్యానా, మేఘాలయ, మధ్యప్రదేశ్ , చత్తీస్ ఘడ్, అండమాన్-నికోబార్ దీవులలో ఉన్నాయి. తెలంగాణలో ఉన్న సున్నపు గుహలు ఇవొక్కటే కావడం విశేషం. నల్లగుట్టల్లో గుహల లోపలికి సహజసిద్ధంగా ఏర్పడిన సొరంగాలు, ఆ సొరంగాల్లో రహస్య మార్గాలు ఉన్నాయి.

గుహల పై భాగంలోని సున్నపురాతి పైకప్పుల నుండి సున్నపునీటితో జారిపడి గట్టిపడిన స్టాలక్టైట్స్ , వాటితో ఏర్పడిన వింతైన ఆకృతులున్నాయి. పరిసర ప్రాంతాల్లో ప్రకృతి సోయగాలు, ఎన్నో అపురూప దృశ్యాలు మనల్ని అబ్బురపరుస్తాయి. ఈ గుట్టలను ఆదిమానవుల ఆవాసాలుగా చరిత్రకారులు భావిస్తున్నారు. అందుకు నిదర్శనంగా ప్రాచీన శిలాయుగానికి చెందిన అనేక రాతి పనిముట్లు ఇక్కడ కనిపిస్తున్నాయి. ఈ గుహల్లో ఆర్కియన్ శిలలు ఉన్నాయి.

కొన్నిచోట్ల గుహలు 10, 50, 100 అడుగుల విస్తీర్ణంతో, కొన్నిచోట్ల గుండ్రంగా, మరికొన్ని చోట్ల పొడవు గదుల్లా ఉన్నాయి. గుహ ప్రారంభంలో వెలుతురు ఉన్నప్పటికీ లోపలికి వెళ్తున్న కొద్దీ చిమ్మచీకటి కమ్ముకుంటుంది. అక్కడక్కడా గుట్ట పైభాగం నుంచి పడే సూర్యరశ్మి వల్ల గుహలో కాస్త వెలుతురు ఉంటుంది.

## ఇల్లందు మున్సిపాలిటిలో ఎమ్మెల్యే కోరం కనకయ్య విస్తృత పర్యటన.



### పర్యటనలో భాగంగా 65.70లక్షల రూపాయల వ్యయంతో సిసిరోడ్డు,డ్రైనెజ్ వంటి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన.

తొలి సమయం, ఇల్లందునవంబర్, 13. స్వయంగా బైక్ నడుపుతూ,కార్యకర్తలలో జోష్ నింపిన ఎమ్మెల్యే కనకయ్య .ఎమ్మెల్యే గారికి అపూర్వ స్వాగతం పలికిన 07,15,16,17,18,22 వార్డుల ప్రజానికం,కాంగ్రెస్ శ్రేణులు.బుగ్గవాగు సైడ్ వాల్ నిర్మాణ పనులు పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం.16వ వార్డులో మంచినీటి సమస్య ఉందటూ మహిళ సోదరిమణులు ఎమ్మెల్యే దృష్టికి తేగా తక్షణమే యుద్ధప్రతిపాదికన మంచినీరు అందించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం.ఇల్లందు లెక్ పార్కు నందు స్విమింగ్ పుల్ సెఫ్టీ పెన్సింగ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శ్రీకారం,పార్కును సుందరీకరించాలని అధికారులకు ఎమ్మెల్యే గారుసూచన.ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ఇల్లందు మున్సిపాలిటి అభివృద్ధికి 65.70 లక్షల రుపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం,భవిష్యత్ మరిన్ని నిధులు తెస్తాం,దేశంలోనే సన్నబియ్యం తెచ్చే ఇచ్చే ఎకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అని,గత పదేళ్ళలో రేషన్ కార్డుల ఊసే లేదు,కాని రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో 2ఏండ్ల పాలనలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు ఇస్తూ ముందుకు వెళ్తున్నాం అని,మంత్రి పొంగులేటి శ్రీనన్న నాయకత్వంలో, పలు నియోజకవర్గంల లో 4000 వేల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం,భవిష్యత్ మరికొన్ని ఇస్తాం అని పేర్కొన్నారు.ఈ కాయక్రమం లో మాజీ మునిపల్ చైర్మన్లు,యదళ్లపల్లి అనసూర్య దమ్మలపాటి వెంకటేశ్వరరావు,మాజీ వైస్ మున్సిపల్ చైర్మన్ జానీ పాషా, టౌన్ పార్టీ అధ్యక్షులు దొడ్డ డానియల్ నాయకులు మడుగు సాంబమూర్తి, మాజీ సర్పంచ్ కల్తీ పద్మ, పాయం లలిత, మాజీ కౌన్సిలర్లు, మాజీ వార్డ్ మెంబర్లు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండలకు దూరంగా వెళ్లాలనుకుంటున్నారా.. అయితే ఈ పర్యాటక ప్రదేశాలు మీ కోసమే!



మన దేశంలో ప్రజలు ఫ్యాన్ల గాలికి సరిపడక, కూలర్లు, ఏసీలు అంటూ వెతుక్కుంటున్నారు. చల్ల గాలికోసం వెతుకుతున్నారు. ఇంత హాట్ సమ్మర్‌లో కూడా అక్కడమాత్రం జీన్స్, స్వెటర్స్, షూస్ తప్పని సరిగా వేసుకోవాలి. లేకపోతే చలికి గజగజ వణికిపోవాల్సి వస్తుంది. ఆ ప్రదేశాలేంటి.. వాటి ప్రత్యేకతలేంటో చదివేయండి. ఎండలు మండిపోతున్నాయి. ముఖాలు మాడిపోతున్నాయి. వేడిని తట్టుకోలేక ఊటీ, కొడైకెనాల్‌లాంటి హిల్ స్టేషన్ల బాటపడుతున్నారు భారతీయులు. ఎండల విషయం పక్కన పెడితే ఇరవై నాలుగు గంటలు మంచు కురిసే దేశాల్లో పరిస్థితి ఎలా ఉంటుంది. ఇవి ప్రపంచంలోనే అత్యంత చల్లని నగరాలు.. ఈ మండుటెండల్లో వెళ్లి వేసవిని కాస్త చల్లగా మార్చుకోండి. ఈ హాట్ సమ్మర్.. కూల్ ప్రదేశాల గురించి చదివి.. వీలైనప్పుడు ఓ ట్రిప్పేసి రండి..

**అస్తానా, కజకిస్థాన్...** అతి తక్కువ ఉష్ణోగ్రత కలిగి ఉన్న నగరాల్లో ఇదొకటి. శీతాకాలంలో మైనస్ 30నుంచి 35 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. ఎనిమిది లక్షల మంది నివాసముంటారు ఇక్కడ. నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు ఈ నగరంలో ఉన్న నదిలో నీరు గడ్డకట్టిపోతుంది. ప్రయాణాలు సాగవు.

**వెర్కోయాన్స్, రష్యా...** ఒమైకాన్ పక్కనే ఉన్న వెర్కోయాన్స్ కూడా అతి చల్లని నగరాల్లో ఒకటి. చలికాలంలో రాకపోకలన్నీ స్తంభించిపోతాయి. యానా నది మీద ప్రయాణ రాకపోకలు జరుగవు. కేవలం హెలిక్యాప్టర్ల ప్రయాణమే సాధ్యమవుతుంది. అదొక్కటే ఏకైక మార్గం. ఇక్కడి జీవితాలు చాలా భిన్నంగా ఉంటాయి. గుడారాలు వెచ్చగా ఉండడం కోసం 24 గంటలు మంటలు పెట్టుకొని జీవిస్తారు. ఇక్కడి జనాభా కూడా చాలా తక్కువ. కేవలం 1300 మంది నివసిస్తారిక్కడ. వేట ఇక్కడి ప్రజల ప్రధాన వృత్తి.

**స్నాగ్, కెనడా...** ఇదొక చిన్న గ్రామం. కెనడాలోని యుకున్లోని అలస్కా హైవే వద్ద ఉన్నది. ఇక్కడి ప్రజలు చలికాలంలో అసలు బయట కనిపించరు.కారణం చలికి తట్టుకోలేకపోవడం. వృత్తులకు, వ్యాపారాలకు సెలవులు ప్రకటించి ఇండ్లలో ఉండిపోతారు.ఉలాన్బాతర్, మంగోలియా 13 లక్షల మంది నివాసముండే పెద్ద నగరం. మంగోలియా రాజధాని కూడా ఇదే. గుడారాల ముందు బొగ్గులతో నిప్పులను తయారు చేసుకొని వెచ్చదనంతో ఉంటారు. చలికాలంలో ఇక్కడి ప్రజలు ఇండ్లలోనే ఉంటారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST : MANDAL DIST : MAHABUBABAD TELANGANA STATE INDIA PIN